# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 104 | హైదరాబాద్ | గురువారం 09-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00






దగ్గు సిరప్ తో చిన్నారుల మృతి.. ఇతర దేశాలకు ఎగుమతిపై ఆరా తీసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

## నేటి భారతం

- మన దేశం మారాలంటే, మనలో ప్రతి ఒక్కరూ మారాలి..
- దేశ నిర్మాణం వ్యక్తి మార్పుతో మొదలవుతుంది..
- స్వప్నాలు చూడండి... కానీ వాటిని నిజం చేసేందుకు కష్టపడండి..
- యువతకు కృషి, పట్టుదల ప్రేరణగా ఉండాలి..
- దేశం కోసం చేసిన ప్రతి చిన్న పని కూడా గొప్పదే..
- సాంకేతికత మన శత్రువు కాదు, మన ప్రగతికి మిత్రుడు..
- ప్రజలతో కలసి నడిచే నాయకుడే నిజమైన నాయకుడు..
- యువత శక్తి దేశ భవిష్యత్తు వారిని ప్రోత్సహించడం మన బాధ్యత..
- పాజిటివ్ ఆలోచనతో ముందుకు సాగితే అసాధ్యమనే పదం ఉండదు..
- ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధి కోసం ఒక మార్పు తేగలడు..
- మన దేశం ఒక సంస్కృతి కాదు అది ఒక జీవన విధానం..
- విజయం కేవలం లక్ష్యం చేరుకోవడంలోనే కాదు ఇతరులకు మార్గదర్శకులవ్వడంలోనే ఉంది.

– శ్రీ నరేంద్ర మోడీ, భారత ప్రధాని..

## ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు


11లో

- 2025 సంవత్సరానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటన
- సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ యాఘీలకు సంయుక్తంగా పురస్కారం
- 'మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' అభివృద్ధికి గాను ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు


11లో

## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి.. దేశాన్ని బలోపేతం చేయండి

- నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రతి ఒక్కరూ 'స్వదేశీ' మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపు
- దేశీయ వస్తువుల వాడకంతోనే అభివృద్ధి, ఉద్యోగాల కల్పన సాధ్యమని స్పష్టం




## బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రభుత్వానికి చెక్ పడుతుంది

11లో

- కేటీఆర్, హరీశ్ రావు
- ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు దిశానిర్దేశనం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని వ్యాఖ్య

## భారత రాజకీయ చరిత్రలో ఒక అసాధారణ నాయకుడు..

మోడీ ఈ రెండక్షరాలు ప్రపంచాన్ని షేక్ చేస్తున్నాయి.. ఆయన చూపిస్తున్న మేధస్సు, ఆయన చెప్పే విషయాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయి.. శత్రువులను సైతం ఒక్క క్షణం ఆగేలా చేస్తున్నాయి.. నేపథ్యం ఏదైనా.. విజయాలు ఆయన సొంతం.. గుజరాత్ ముఖ్యమంత్రిగా.. భారత ప్రధానిగా ఆయన సాగించిన ప్రయాణం.. ఆయన చూపిన తెగువ అజరామరం.. వయసుతో పనిలేకుండా.. యూత్ లోనూ ఆయన క్రేజ్ అనన్యసామాన్యం.. మోడీ సాధించిన ఘనత వైపు ప్రపంచం తలెత్తి చూస్తోంది.. మూడుసార్లు భారత ప్రధానిగా అప్రతిహతంగా సాగిన ఆయన విజయవంతమైన ప్రయాణం న భూతో.. న భవిష్యత్.. ఇందిరాగాంధీ లాంటి శక్తివంతమైన నాయకురాలు సృష్టించిన 3రికార్డును సైతం ఆయన అధికమించడం అభినందనీయం.. బీజేపీలో ఇలాంటి నాయకుడు మళ్ళీ వస్తారా..? అన్న ప్రశ్నకు ఎవరూ జవాబు చెప్పలేకపోతున్నారు.. పాతికేళ్ల ఆయన రాజకీయ ప్రస్థానంపై అభినందనలు అందిస్తూ " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " సహకారంతో ఒక ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది భారత శక్తి దిన పత్రిక..


12లో

## బీసీ రిజర్వేషన్ల అంశంపై వాడివేడిగా వాదనలు..

విచారణ రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

- రేపు మధ్యాహ్నం తదుపరి వాదనలు వింటామన్న హైకోర్టు
- రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమన్న పిటిషనర్
- సమగ్ర అధ్యయనం తర్వాతే బిల్లు తీసుకువచ్చామన్న ప్రభుత్వం

11లో




## మరింత విజయవంతం చేద్దాం

### ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ
- శ్రీశైలం మల్లన్నను దర్శించుకోనున్న నరేంద్ర మోదీ
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో భారీ బహిరంగ సభ
- జీఎస్టీ సంస్కరణల ఉత్సవంలో పాల్గొననున్న ప్రధాని
- ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం
- సభను విజయవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు

11లో



# సంపాదకీయం

## భారత్ వైపు చూస్తున్న ప్రొఫెషనల్స్

హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ డోనల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం అక్కడ ఉంటున్న నిపుణులైన భారతీయుల్ని వెనక్కి తీసుకురావచ్చన్న ఆలోచనను ఇక్కడి పాలకుల్లో కల్పించింది. విదేశాల్లో ఉంటున్న భారతీయులు స్వదేశానికి వచ్చి దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితంగా ఉండే అధికారి ఒకరు చెప్పారు. హెచ్1బీ వీసాలు అమెరికాకు ఉపయోగపడతాయని, వాటి దరఖాస్తు ఫీజు పెంచడం వల్ల అంతర్జాతీయ ప్రతిభను భారతదేశంవైపు ఆకర్షించే అవకాశం ఏర్పడుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో సభ్యుడొకరు చెప్పారు. 30 ఏళ్లుగా టెక్నాలజీ, మెడికల్, ఇతర ఇన్నోవేటివ్ రంగాలలో భారత్ నుంచి వలస వెళ్లిన అత్యంత ప్రతిభావంతులైన నిపుణులను రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ ద్వారా తిరిగి రప్పించాల్సిన సమయం ఆసన్నమైంది. అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో వలసదారులు, ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు ప్రవాసులను ఈ దిశగా ఆలోచించేలా చేస్తోందని చెప్పడానికి కొన్ని సంఘటనలు ఉన్నాయి. అయితే లక్షల మందిని బెల్లేవ్ నుంచి బెంగళూరు తీసుకురావడం చెప్పినంత తేలిక్కాదని కొంతమంది నిపుణులు అన్నారు. అమెరికా తర్వాత.. యూరప్, ఆస్ట్రేలియాలోనూ భారతీయులకు నిరసనలు ఎందుకు ఎదురవుతున్నాయి? 20 ఏళ్ల కిందట అమెరికాలో స్థిరపడిన కొంతమంది భారతీయుల్లో నితిన్ హాసన్ ఒకరు. గతేడాది ఆయన బెంగళూరు రావాలని హఠాత్తుగా నిర్ణయం తీసుకున్నారు. అయితే అదంత తేలికైన నిర్ణయం కాదు. ఎందుకంటే, మెటాలో లక్షల రూపాయల జీతాన్ని వదులుకుని భారత్‌లో అనిశ్చితిలో ఉన్న స్టార్టప్‌ల రంగంలోకి వెళ్లాలని తీసుకున్న నిర్ణయమది. సొంతంగా ఏదో ఒకటి చేయాలని అనుకునేవాడిని. అయితే వలసదారుడిగా అమెరికాలో అందుకు నాకున్న స్వేచ్ఛ చాలా తక్కువ" అని ఆయన చెప్పారు. ఆయన భారత్ తిరిగొచ్చిన తర్వాత రెండు స్టార్టప్‌లు ప్రారంభించారు. ఇందులో అమెరికాలో స్థిరపడిన భారతీయులు "స్వదేశానికి తిరిగి రావడం వల్ల కలిగే భావోద్వేగ, ఆర్థిక, వృత్తిపరమైన సవాళ్లను అధిగమించడంలో సాయపడే బీ2ఐ (బ్యాక్2 ఇండియా) అనే ప్లాట్‌ఫామ్ కూడా ఉంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక వలసదారులతో వ్యవహరిస్తున్న తీరు చూసి, అమెరికా వెళ్లాలని భావిస్తున్న అనేకమంది తమకు ఫోన్ చేస్తున్నారని, హెచ్1బీ గొడవల వల్ల ఇది ఇంకా పెరగవచ్చని ఆయన బీబీసీతో చెప్పారు. తమకు ఇకపై గ్రీన్ కార్డు రాకపోవచ్చని అనేకమంది నిపుణులు భావిస్తున్నారు. బ్యాక్2 ఇండియాను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత మాకు వచ్చే కాల్స్ మూడురెట్లు పెరిగాయి. గత 6 నెలల్లో 200 మందికి పైగా ఎన్ఆర్ఐలు, తిరిగి రావడానికి ఉన్న అవకాశాల గురించి అడిగారు" అని హసన్ చెప్పారు. అమెరికా యూనివర్సిటీల్లో భారతీయ ప్రతిభావంతుల కోసం వెదుకుతున్న వాళ్లు ఈ మార్పు నిజమేనంటున్నారు."ఐవీ లీగ్ యూనివర్సిటీల్లో చదువుతూ, చదువు పూర్తైన తర్వాత ఇండియా వెళ్లిపోవాలని భావిస్తున్న విద్యార్థుల సంఖ్య ఈ సీజన్‌లో 30శాతం పెరిగింది" అని బీడీఓ ఎగ్జిక్యూటివ్ సెర్చ్ సీఈఓ శివానీ దేశాయ్ చెప్పారు. ఈ అనిశ్చితి భారత సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను అమెరికాలో తమ కెరీర్ గురించి తీవ్రంగా ఆలోచించేలా చేస్తోందని ఆమె అన్నారు."అనేకమంది ఇప్పటికే ఇక్కడ స్థిరపడినప్పటికీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర సీనియర్ మేనేజర్లు భారత్‌కు వెళ్లిపోవడాన్ని సీరియస్‌గా ఆప్షన్‌గా భావిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది" అని దేశాయ్ చెప్పారు. భారత్‌లోని బహుళజాతి కంపెనీల రిమోట్ కార్యాలయాలు లేదా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) పెరిగాయి. ఈ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉండటం కూడా సొంత దేశానికి వెళ్లాలనుకునే భారతీయుల ఆలోచనకు బలం చేకూరుస్తోంది. టెక్ నిపుణులకు అమెరికా ద్వారాలు మూస్తే, ఈ కార్యాలయాలు అలాంటి నిపుణులకు కేంద్రంగా మారవచ్చు. దీని వల్ల జీసీసీలు ప్రతిభావంతులకు మరింత ఆకర్షణీయంగా మారతాయని అస్సెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ తెలిపింది. అమెరికాకు వలస వెళ్లిన మేథో సంపత్తిని తిరిగి తీసుకు రావడానికి ప్రభుత్వం వైపు నుంచి సీరియస్‌గా ప్రయత్నం జరగాలని, అయితే ప్రస్తుతం అది కనిపించడం లేదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పని చేసిన సంజయ్ బారు చెప్పారు."తాను వెనక్కి రప్పించాలని భావిస్తున్న అగ్రశ్రేణి శాస్త్రవేత్తలు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను విదేశాలకు వెళ్లి గుర్తించాలి. ఈ ప్రయత్నం ప్రభుత్వంలో ఉన్నత స్థాయి నుంచి జరగాలి" అన్నారు. అంతరిక్షం, అణు సాంకేతికతవంటి రంగాలలోని ప్రతిభావంతుల్ని స్వదేశానికి తీసుకురావడానికీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వంటి సంస్థలను ఏర్పాటు చేయడానికీ భారత తొలి ప్రధాని నెహ్రూ ఆ రోజుల్లో ఇలాగే చేశారని సంజయ్ బారు గుర్తు చేశారు. ఇక్కడి ప్రతికూలతలు అంటే చట్టపరమైన నిబంధనలు, అధికార యంత్రాంగపు నిర్లక్ష్య వైఖరి, వ్యాపారానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించకపోవడం వంటివి దశాబ్దాలుగా సంపన్నులు, అధిక సంపాదన కలిగిన భారతీయులు వలస వెళ్లి పోవడానికి ప్రధానమైన కారణాలు. 2020 నుంచి దాదాపు 5 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు పౌరసత్వం వదులుకోవడం, ఇతర దేశాలలో స్థిరపడుతున్న మిలియనీర్లు అధికంగా ఉన్న టాప్ 5 దేశాలలో భారత్ కూడా ఒకటి. విదేశాల్లో ఉన్న భారతీయులను తిరిగి తీసుకు వచ్చే విషయంలో ప్రభుత్వం నిజంగా సీరియస్‌గా ఉంటే, అనేక అడ్డంకులను తొలగించాలని హాసన్ అన్నారు. ఇందులో సరళమైన పన్నుల విధానం, స్పెషల్ స్టార్టప్ వీసాలవంటి ప్రోత్సాహకాలతోపాటు, మౌలిక సదుపాయాలు, పెరిగిపోతున్న పట్టణ రద్దీ వంటి సమస్యలను కూడా పరిష్కరించాల్సి ఉంటుంది. అంటే దీని అర్థం, మేధావులు, విద్యావంతులు ఎదగడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలని. "వారి సొంత దేశంలో పరిశోధన, అభివృద్ధిని మెరుగుపరచడం, విద్యలో స్థాయిని పెంచడం కూడా ఇందులో భాగంగా ఉండాలి" అని సంజయ్ బారు అన్నారు. ఎందుకంటే, గత 50 ఏళ్లలో భారతీయ ప్రతిభను అమెరికాకు ఇంతగా ఆకర్షించిన అంశాలు ఇవే.

# 10 నుంచి పోరుబాటకు జగన్

విజయవాడ, , భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటి వరకు మీడియా ముందు విమర్శలు, సభలో ప్రశ్నించడం, మెడికల్ కాలేజీలు సందర్శించడానికి పరిమితమైన వైసీపీ ఇప్పుడు ఆందోళన బాట పడుతోంది. ప్రజలకు మేలు చేసే కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోందని ఆరోపిస్తున్న జగన్ పార్టీ ఈ నెల పది నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నివాసంలో తాడేపల్లిలో మంగళవారం వైసీపీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లాల అధ్యక్షులు, పార్లమెంటు పరిశీలకులు పాల్గొన్నారు. పార్టీని బలోపేతం చేయడం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ఆందోళనలు చేయడంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇందులో ముఖ్యంగా మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని జగన్ అభిప్రాయపడ్డారు. దీన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ పదో తేదీ నుంచి అక్టోబర్ 22 వరకు వివిధ రూపాల్లో తమ నిరస తెలియజేయబోతున్నట్టు వెల్లడించారు. అక్టోబర్ 10 నుంచి 22 వరకు రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రజల వద్దకు వెళ్ళి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించాలని, మెడికల్ కాలేజీలు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయని వివరించనున్నారు. భవిష్యత్‌లో పేదవాడికి వైద్య సాయం అందకుండా పోతుందని కూడా తెలియజేయనున్నారు. 28వ తేదీన ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు ర్యాలీలు తీస్తారు. నవంబర్ 12న జిల్లా కేంద్రంలో ధర్నాలు చేస్తారు. అనంతరం ప్రతి నియోజకవర్గంలో 50వే సంతకాలు సేకరిస్తారు. కోటి సంతకాలు, ప్రజల అభిప్రాయాన్ని గవర్నర్‌కు తెలియజేస్తారు. దీని కోసం నవంబర్ 26న పార్టీ నేతలు గవర్నర్‌ని కలుస్తారు. అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించబోతున్నట్టు జగన్ ప్రకటించారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాల సేకరించాలని టార్గెట్ పెట్టారు. నియోజకవర్గ సమన్వయ కర్తలు రోజుకు రెండు గ్రామాలు సందర్శించాలని సూచించారు. రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అక్టోబరు 28న నియోజకవర్గ స్థాయిలో అధికారులకు వినతి పత్రాలు



అందజేయాలని చెప్పారు. నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో జరిగే ర్యాలీలో తాను కూడా పాల్గొంటానని పేర్కొన్నారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాల దస్త్రాలను నవంబర్ 24న జిల్లాల నుంచి విజయవాడకు చేరవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించాలని నేతలకు సూచించారు. తర్వాత వాటిని గవర్నర్‌కు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం కళ్లార్పకుండా అబద్దాలు చెబుతోందని అన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడించిందని విమర్శించారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, అరాచకం, అవినీతి రాజ్యమేలుతో oదని ఆరోపించారు. పాలనను పట్టించుకోని చంద్రబాబు కేవలం సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషిస్తున్నా రని ధ్వజమెత్తారు. దోచుకో పంచుకో తినుకో విధానంలో చంద్రబాబు, ఆయన కుమారుడు, వారి బినామీల జేబులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా లిక్కర్ పాలసీ ఏర్పాటు చేస్తే నేడు పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరూ చూస్తున్నారని జగన్ తెలియజేశారు. కల్తీ లిక్కర్ మాఫియా నడుస్తోందని వీళ్లకు అధికారులు సహాయం చేస్తున్నారని, పెదబాబు, చినబాబుకు ముడుపులు ఇచ్చి నాయకులు ఇల్లీగల్ నెట్‌వర్క్ నడిపిస్తున్నారని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పద్ధతి ప్రకారం కల్తీ మద్యాన్ని ఓ కుటీర పరిశ్రమలా నడిపిస్తున్నారని ఆన్నారు. ప్రభుత్వం బడుల్లో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని తమ హయంలో నో అడ్మిషన్ బోర్డులు పెట్టామని గుర్తు చేశారు జగన్. రైతులకు ఎరువులు, పురుగుల మందులు అందడం లేదన్నారు.

# ఏకపక్ష నిర్ణయాలేనా

## ఏమైంద సమన్వయ కమిటీ..

విజయవాడ, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఆంధ్రప్రదేశ్ లో 2024 శాసనసభ ఎన్నికలకు మూడు పార్టీలు కలసి పోటీ చేశాయి. టీడీపీ, జనసేన, బీజేపీలు కలసి గత ఎన్నికల్లో బరిలోకి దిగి 164 అసెంబ్లీ స్థానాలను దక్కించుకున్నాయి. కూటమి ఏర్పడిన తర్వాత మూడు పార్టీల అగ్ర నేతలు కలసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకుని అందులో చర్చించి నిర్ణయం తీసుకోవాలని డిసైడ్ చేశాయి. రాష్ట్ర స్థాయిలో ఒక సమన్వయ కమిటీని కూడా మూడు పార్టీలు కలిసి ఏర్పాటు చేశాయి. మూడు పార్టీల నుంచి ముఖ్యమైన ఇద్దరు నేతల చొప్పున రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. అయితే ఎన్నికలకు ముందు మాత్రమే ఈ సమన్వయ కమిటీ పనిచేసింది. ఎన్నికల ముందు వరకే.... ఎన్నికల సమయంలో పొత్తులు, వివాదాలు, సీట్లు రాకపోవడంతో అలకలు వంటి వాటిపై ఈ సమన్వయ కమిటీ దృష్టి పెట్టి జిల్లాల వారీగా పర్యటించి వాటిని సమర్ధవంతంగా విభేదాలను అణిచివేయగలిగింది. అందుకే టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ స్థాయి నేతల నుంచి ద్వితీయ శ్రేణి నాయకుల వరకూ కలసి కట్టుగా పనిచేసి పార్టీల అభ్యర్థులు విజయం సాధించడానికి సమన్వయ కమిటీ దోహదపడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కూడా ఒక నిర్ణయం తీసుకున్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఇతర పార్టీల నుంచి ఎవరినైనా చేర్చుకోవాలనుకుంటే అందులో సమన్వయ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కూడా అనుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం మూడు పార్టీలు సమన్వయ కమిటీ విషయమే మర్చిపోయారు. దీనివల్ల మూడు పార్టీల్లో నియోజకవర్గ స్థాయిలో విభేదాలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ మాదిరిగానే జిల్లా స్థాయిలోనూ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్న కూటమి నిర్ణయం కార్య రూపం దాల్చలేదు. దీంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారయ్యారు. కేవలం ఇన్ ఛార్జుల మంత్రులు మాత్రమే నేతల మధ్య విభేదాలను పరిష్కరించాల్సి వస్తుంది. అయితే ఇది సరిపోదని, జిల్లా స్థాయిలో మూడు పార్టీలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని కూడా యాక్టివ్ చేయాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు తమ గెలుపునకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకే పదవులు, కాంట్రాక్టులు దక్కేలా చూస్తుండటంతో మిగిలిన రెండు పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర స్థాయి కమిటీని యాక్టివ్ చేయడంతో పాటు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వినిపిస్తుంది. జనసేన పార్టీతో సమన్వయం కోసం తెలుగుదేశం పార్టీ ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. నాటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చన్నాయుడు, యనమల రామకృష్ణుడు, పయ్యావుల కేశవ్, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సభ్యులుగా నియమితులయ్యారు. అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు జనసేన, టీడీపీ మధ్య సమన్వయం కోసం ఈ కమిటీ పని చేస్తుందని నాడు తెలిపింది. జనసేన నుంచి కూడా నాదెండ్ల మనోహర్ తో పాటు మరికొందరి నేతలు నియమించారు. ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించినా ఎన్నికలు, పొత్తు, దాని తర్వాత మాత్రం అది కనుమరుగవ్వడంతోనే ఇప్పుడు పార్టీల్లో కిందస్థాయి నేతల మధ్య సఖ్యత లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# మరో కొత్త ఆర్వోబీ

విజయవాడ,భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆమోదం లభించింది. విజయవాడ వాంబేకాలనీ వాసుల చిరకాల కోరికను నెరవేరుస్తూ వాంబే కాలనీ- మధురానగర్ మధ్యన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాంబే కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు ప్రాజెక్టులలో కదలిక వస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ వాంబే కాలనీ వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. ఈ కాలనీలో నివసించే పేదలు, కూలీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మధురానగర్ - వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి అడుగులు పడనున్నాయి. అజిత్ సింగ్ నగర్, వాంబేకాలనీలలో నివసించే కూలీలు, నిరుపేదలు పనుల కోసం విజయవాడ నగరంలోకి రావాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. సుమారు 50 వేల మంది కూలీలు, కార్మికులు విజయవాడలోకి రావాలంటే వాంబేకాలనీ- దేవీనగర్ మధ్య ఉన్న రైల్వేట్రాక్‌ను దాటాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం ఈ రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ- విశాఖ రైల్వేలైన్ దాటి దేవీనగర్, మధురానగర్ మీదుగా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ట్రాక్ సుమారుగా పది అడుగుల ఎత్తు ఉండటంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పలుసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో ఈ సమస్యను పరిష్కరించాలని, రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఈ అంశం మీద రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ కూడా రాశారు. ఈ లేఖపై స్పందించిన రైల్వే మంత్రి.. వాంబే కాలనీ- మధురానగర్ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి లేఖ ద్వారా సమాచారం అందించారు. లిమిటెడ్ హైట్ సబ్ వే ( రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్ పనులు ప్రారంభించామని.. లేఖలో వివరించారు. ఈ నిర్మాణం పూర్తి అయితే అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్ మీద భారం తగ్గుతుంది. అలాగే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు చిరకాల స్వప్నమైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వాంబే కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

# టీడీపీ నేతల మధ్య సమన్వయం కరువు

గుంటూరు, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
తెలుగుదేశం పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం సక్రమంగా పనిచేయడం లేదా? పార్టీ కార్యాలయం వల్లనే పార్టీ ఇన్ని రకాలుగా ఇబ్బందులు పడుతుందా? నేతల మధ్య సమన్వయం లేకపోవడానికి కూడా పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం అనుసరిస్తున్న మెతక వైఖరి అని చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు చేతుల్లోకి తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాత 1995 నుంచి ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ ఏం మాట్లాడాలన్నా అది ముందు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉండేది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ లో ఉన్న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో మీడియా సమావేశం పెట్టాలన్నా, లేకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ఏ విషయాలను అయినా ప్రస్తావించాలన్నా ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాల్సి వచ్చేది. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే... ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే లైబ్రరీలో అన్ని అంశాలకు సంబంధించిన విషయాలు.. అసెంబ్లీ చట్టాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమయ్యేది. నాడు దేవేందర్ గౌడ్ నుంచి కింది స్థాయి నేత వరకూ లైబ్రరీకి వెళ్లే అలవాటు ఉండేది. వారు అసెంబ్లీ సమావేశాల్లోనో, మీడియా సమావేశాల్లోనూ మాట్లాడాలంటే లైబ్రరీకి వెళ్లి తాము మాట్లాడబోయే అంశానికి సంబంధించిన వాటిపై అధ్యయనం చేసేవారు. గతంలో ఉన్న విషయాలను కూడా వారు ఆకళింపు చేసుకునే వారు. అధికారంలో ఉన్నప్పుడైనా, లేకపోయినా సరే ఖచ్చితంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి అందుకు సంబంధించిన అంశాలను పరిశీలించేవారు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆ సంప్రదాయానికి నేతలు నీళ్లొదిలేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వారికి కేటాయించే సమయంలో మాత్రమే



ఎమ్మెల్యేలు వస్తున్నారు. సబ్జెక్ట్ పై అవగాహన కోసం కానీ, తాము మాట్లాడలనుకున్న విషయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియపర్చేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం కూడా దీనిని పట్టించుకోవడం లేదు. సీనియర్ నేతలకు మాత్రమే ఈ విషయం తెలుసు. ఇప్పుడంతా కొత్త తరం నాయకులు కావడంతో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతోనే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం టీడీపీ సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ పాలనలో బిజీగా ఉండటంతో పార్టీ కేంద్ర కార్యాలయం చూసుకోవాల్సి ఉన్నా వాటిని పట్టించుకోకపోవడంతో ఈ రకమైన సమస్యలు అసెంబ్లీలో గాని, బయట గాని తలెత్తుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇందుకు సంబధించి బలోపేతం చేస్తే బాగుంటుందన్న సూచనలు వస్తున్నాయి.

# మోత మ్రోగిస్తున్న దీవాళి, వెండి

ముంబై, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఖరీదైన లోహాల గురించి ప్రస్తావన వస్తే ముందు వరుసలో ఉంటుంది బంగారం. పైగా ఇటీవల కాలంలో బంగారం ధర అంతకుమించి అనే స్థాయిలో పెరిగిపోతుంది. ఇది ఎక్కడదాకా వెళ్తుందో తెలియడం లేదు కానీ.. ప్రస్తుతానికి అయితే ధర తారాజువ్వలాగా ఆకాశంలో ప్రయాణం చేస్తోంది. ఒకప్పుడు తులం బంగారం ధర 50 నుంచి 60 వేల మధ్యలో ఉండేది. కానీ ఈ ఏడాది మాత్రం ఏకంగా 1,20,000 మార్కును దాటిపోయింది. లక్ష రూపాయలకు తులం అంటేనే చాలామంది నోర్లు వెళ్లబెట్టారు. కానీ ఇప్పుడు లక్ష 50 వేల వరకు వెళ్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరికొందరేమో ధర తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఈ ఊగిసలాట మధ్య మరో చర్చ కూడా మొదలైంది. బంగారమే అత్యంత ఖరీదైన లోహం అనుకుంటే.. ఇప్పుడు దానిని మించిపోయేలా ఉంది వెండి. ఒకప్పుడు వెండికి అంతగా డిమాండ్ గా ఉండేది కాదు. కిలో ధర మహా అయితే 20 నుంచి 40 వేల మధ్యలో ఉండేది. కానీ ఇప్పుడు రెండు కిలో ధర లక్ష రూపాయలను మించిపోయింది. అంతేకాదు ధరలో బంగారంతో పోటీపడుతోంది. గడిచిన ఏడాదిలోనే వెండి ధర ఏకంగా 54 శాతం పెరిగింది. పారిశ్రామిక రంగంలో వెండిని విపరీతంగా వినియోగిస్తున్నారు. సోలార్ ప్యానల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో వెండికి విపరీతమైన డిమాండ్ ఉంది.

# డ్రోన్ సిటీకి గ్రీన్ సిగ్నల్

కర్నూలు, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఏపీకి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది కేంద్రం. ముఖ్యంగా ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీకి అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ తరచూ ఏపీలో పర్యటిస్తూ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ వస్తున్నారు. మరోసారి ఈనెల 16న ఏపీలో పర్యటించనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. అయితే కేవలం శ్రీశైలం ఆలయ సందర్శనే కాకుండా ప్రధాని కర్నూలులో డ్రోన్ సిటీకి శంకుస్థాపన చేస్తారని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందుకు సంబంధించి ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి సచివాలయంలో ఆర్టిజిఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు సీఎం చంద్రబాబు. అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. అమరావతిని డ్రోన్ల హబ్ గా మార్చాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు కర్నూలులో డ్రోన్ల సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. డిసెంబర్లో ఏపీలో భారీ డ్రోన్ షో నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరగాలని.. ఆ దిశగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ సిటీ అనేది చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్ట్. ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 16న కర్నూలులో పర్యటించనున్నారు. మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదే వేదికపై ప్రధాని చేతుల మీదుగా డ్రోన్ సిటీని ప్రారంభించనున్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్ షో నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం ఆలయ సందర్శన సందర్భంగా పురావస్తు శాఖ ప్రదర్శన ఏర్పాటు చేయనుంది. ఆలయ సంపద గురించి ప్రధానికి వివరించి ప్రయత్నం చేయనుంది.

# జగన్ ఆన్ ఫైర్ ...వయా ఎంప్లాయిస్

నెల్లూరు,భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఏపీలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరుబాట పట్టనున్నాయా? కూటమి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించనున్నాయా? అందుకు తగ్గ గ్రౌండ్ వర్క్ సిద్ధమవుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే కొన్ని ఉద్యోగ సంఘాల నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు కూటమి ప్రభుత్వంపై. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన ఉద్యోగ సంఘాల నేతలు తెరపైకి వస్తున్నారు. జిల్లాల పర్యటన చేస్తున్నారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ సంఘాలకు మద్దతుగా ట్వీట్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను రోడ్డున పడేసిందని.. వారి బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులతో కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానాలు పెరుగుతున్నాయి. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమికి ప్రధాన కారణం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు. నవరత్నాలకు ప్రాధాన్యం ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులను చాలా తేలికగా తీసుకున్నారు. చివరకు వారి జీతాల చెల్లింపులో కూడా ఇబ్బందులు తెచ్చిపెట్టారు. ఒకటో తేదీన అందాల్సిన జీతాన్ని ఎప్పుడో నెల మధ్యలో ఇచ్చేవారు. వారికి సంబంధించిన రాయితీలను నిలిపివేశారు. అన్ని రకాల చెల్లింపులను జాప్యం చేశారు. ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తం అయింది. రోడ్లపైకి వచ్చి నిరసన చేసే పరిస్థితికి వచ్చింది. ప్రభుత్వం నుంచి కవ్వింపు చర్యలు ఎదురు కావడంతో ఆందోళనలు తీవ్రతరమయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రత్యర్థులకు మించి..



ఉద్యోగులు శత్రువులుగా మారారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దారుణంగా ఓడించడంలో వారి పాత్ర కీలకం. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ఎదురైన అంశాలను గుణపాఠాలుగా మార్చుకోవాల్సిన కూటమి ప్రభుత్వం.. ఉద్యోగుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ముఖ్యంగా పెండింగ్ డీఏ విషయంలో ప్రతి మంత్రివర్గ సమావేశంలో సానుకూల ప్రకటన వస్తుందని ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు ఎదురుచూస్తూ వచ్చారు. కానీ నిరాశ ఎదురవుతూ వచ్చింది. అయితే దసరాకు పెండింగ్ డీఏలు విడుదల చేస్తారని భావించారు. కానీ అలా జరగలేదు. ఈనెల 10 న మంత్రివర్గ సమావేశం జరగనుంది. దీపావళి కానుకగా రాయితీలతో పాటు చెల్లింపులు చేస్తారని ఇప్పుడు ప్రచారం ప్రారంభం అయింది. అయితే ఒకవైపు ఉద్యోగుల డీఏలకు సంబంధించి ప్రభుత్వ ప్రకటన ఉంటుందని పెద్ద ఎత్తున వార్తలు వస్తుండగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూల ఉద్యోగ సంఘం నేత ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. వైసిపి ప్రభుత్వం పై ఉద్యోగులు విరక్తి చెంది మూడేళ్ల తర్వాత బయటకు వచ్చారని.. కానీ కూటమి ప్రభుత్వ చర్యల పుణ్యమా అని ఇప్పుడే రోడ్లపైకి వస్తున్నారని వచ్చారు. ఎంత జరుగుతున్నా కూటమికి అనుకూలంగా పనిచేసిన ఉద్యోగుల సంఘ నేతలు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి సంచలన ట్వీట్ చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులను దారుణంగా వంచిందని.. తక్షణం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగ సంఘాల కదలికలు అనుసరించి తెర వెనుక ఉద్యమాలకు సన్నద్ధం అవుతున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి.

# వైసీపీ గూటికి ఆమంచి

ఒంగోలు,భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
పోయిన చోటే వెతుక్కోవాలని చూస్తున్నారు వైయస్ జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో బలపడాలని భావిస్తున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని చూస్తున్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు పక్క ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగానే ఈ నెల 9న ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు సంబంధించి కూటమి ప్రభుత్వంపై సమరం



మొదలు పెట్టనున్నారు. దానిని చివరి వరకు కొనసాగించాలని చూస్తున్నారు. 2003లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఫార్ములాను అనుసరించనున్నారు. రాజకీయంగా అవకాశాలు లేని బలమైన నేతలను తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో ఒక బలమైన నేతను పార్టీలోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ విషయంలో వై వి సుబ్బారెడ్డి చురుకైన పాత్ర పోషిస్తున్నారు. అక్కడ బాలినేని శ్రీనివాస్ రెడ్డి ద్వారా జరిగిన డ్యామేజ్ ను భర్తీ చేసేందుకు ఆమంచి కృష్ణమోహన్ రంగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి ప్రకాశం జిల్లా ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తోంది. ఆ పార్టీకి బలమైన నేతగా బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఉండేవారు. ఈయన వై వి సుబ్బారెడ్డి కి స్వయానా బావ. వైయస్ జగన్మోహన్ రెడ్డికి సుబ్బారెడ్డి బాబాయ్ అవుతారు. ఈ లెక్కన శ్రీనివాస్ రెడ్డి కూడా జగన్మోహన్ రెడ్డికి సమీప బంధువు. అందుకే వైయస్ రాజశేఖర్ రెడ్డి బాలినేని కి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. 2004లో తొలిసారిగా టిక్కెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. దీంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2009లో గెలిచిన బాలినేని ని మరోసారి మంత్రి పదవి ఇచ్చారు రాజశేఖర్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో జగన్ వెంట అడుగులు వేశారు బాలినేని. 2014లో బాలినేని ఓడిపోగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండిపోయింది. ఆ సమయంలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు బాలినేని. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యేగా గెలిచిన బాలినేని ని మంత్రిని చేశారు జగన్. కానీ విస్తరణలో తొలగించేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. అది మొదలు అనేక రూపాల్లో జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందులు కు గురి చేస్తూ వచ్చారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జనసేనలో చేరిపోయారు బాలినేని. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్తూ వెళ్తూ బాలినేని జగన్మోహన్ రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అనేక రూపాల్లో ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఇవి జగన్మోహన్ రెడ్డిని ఎంతో బాధించాయి. అలాగని ప్రకాశం జిల్లాలో బలమైన నేతలు లేరు. కరణం బలరాం ఉన్న ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్థానికేతరుడు. ఇటువంటి పరిస్థితుల్లో బలమైన నేత ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి అవసరం. బాబాయ్ వై.వి సుబ్బారెడ్డి ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకుడు అవసరం. అందుకే ఇప్పుడు ఆమంచి కృష్ణమోహన్ వైపు జగన్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆయనతో రాయబారాలు పూర్తయ్యాయని? త్వరలో ఆమంచి కృష్ణమోహన్ వైసీపీలో చేరుతారని ప్రకాశం జిల్లాలో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు ఆమంచి కృష్ణమోహన్. 2000లో వేటపాలెం కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు

## గోవులను లారిలో అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్న ముఠా అరెస్టు

భద్రాచతం భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
బూర్గంపాడు మండలం జింకల గూడెం గ్రామం నుండి అక్రమంగా పశువుల రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బూర్గంపాడు పోలిసులు అరెస్టు చేసారు.
బూర్గంపాడు మండలం జింకల గూడెం గ్రామం నుంచి హైదరాబాద్ కబేలకి 32 పశువులను లారీలో తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పశువులను తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకొని ఆ వాహనంతో పాటు అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అనంతరం లారీ, ఇద్దరు వ్యక్తులను బూర్గంపాడు పోలీస్ స్టేషన్కు తరలించారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గోవులను పాల్వంచ గోశాలకు తరలించారు.
===============================

## క్వారీలో పిడుగు పడటంతో ముగ్గురు మృతి? మరో నలుగురికి గాయాలు

శ్రీకాకుళం భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
శ్రీకాకుళం జిల్లామెళియాపుట్టి మండలంలోని జంగలపాడు రాజయోగి క్వారీలో పిడుగు పడటంతో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే టెక్కలి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో బైపోతు హరిప్రసాద్ పరిస్థితి చాలా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతులు శ్రావణ్ కుమార్ (45), ఏళ్ల హేమరాజ్ (25), పింటు (25) గుర్తించారు
===========================


## ట్రావెల్ బస్సు ను ఢీకొన్న లారీ

ఆదిలాబాద్ భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44 పై భీంసరి బ్రిడ్జి వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు వెళు_న్న వర్మ ప్రైవేట్ ట్రావెల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది ప్రయాణికులు



గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది రేఖ, వసీం గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.
===========================

## భద్రాచలం: బాణసంచా అక్రమ నిల్వలపై దాడులు



భద్రాచలం: భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
భద్రాచలం పట్టణంలో మంగళవారం సాయంత్రం టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి పోలీసులు నాలుగు చోట్ల బాణసంచా అక్రమ నిల్వలపై దాడులు నిర్వహించారు. జనసంచార ప్రాంతాలు, ఇళ్ల మధ్యలో అనుమతి లేకుండా భారీగా బాణసంచా నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో గోదాములను తనిఖీ చేశారు. దీపావళి పండుగ సందర్భంగా వ్యాపారులు ముందుగానే తెప్పించిన ఈ బాణసంచాకు అనుమతులు తీసుకోలేదని, రూ. 10 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపా

# జూబ్లిహిల్స్ ఉపఎన్నికపైనే దృష్టి

హైదరాబాద్,భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కన్నా ఎక్కువగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికపైనే దృష్టి సారించారు. తెలంగాణలో సంఖ్యాపరంగా పార్టీలు ఎక్కువే. కానీ ప్రధాన పోటీ జరిగేది మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే. అయితే జూబ్లిహిల్స్ ఉపఎన్నికలో డైరక్ట్ పాలిటిక్స్ అసలు కనిపించడం లేదు. అన్నీ తెర వెనుక రాజకీయాలే కనిపిస్తున్నాయి. పార్టీల



గెలుపు వెనుక రాజకీయ సమీకరణాలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఇతర పార్టీల మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. మజ్లిస్ పార్టీతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ పార్టీ మద్దతు తమకే ఉంటుందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. కానీ మజ్లిస్ వైపు నుంచి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. మజ్లిస్ విధానం ప్రకారం ఆ పార్టీ ఎవరికి బహిరంగంగా మద్దతు ప్రకటించదు. కానీ లోపాయికారీ మద్దతు మాత్రం ఇస్తూ ఉంటుంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో సన్నిహితంగా ఉండి పొలిటికల్ ఫిక్సింగ్ చేసుకుంటారు. తమ అడ్డా అయిన పాతబస్తీలోకి ఎవరూ రాకుండా.. బయట వైపు ఆయా పార్టీలకు మద్దతు ఇస్తూంటారు. ఇప్పటి వరకూ బీఆర్ఎస్ పార్టీకి అదే సహకరించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి తమకు సహకరిస్తారని అనుకుంటున్నారు. మజ్లిస్ 2014లో జూబ్లిహిల్స్ లో పోటీ చేసింది. రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత బీఆర్ఎస్ కుక సహకారంలో భాగంగా 2018, 2023 ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఇప్పుడు కూడా పోటీపై ఎలాంటి ప్రకటన చేయలేదు కాబట్టి కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ పాత పరిచయాలతో బీఆర్ఎస్ కూడా మజ్లిస్ మద్దతు కోసం ప్రయత్నిస్తోంది. మరో వైపు ఉపఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ సిరియస్ గా దృష్టి సారించలేదు. గతంలో ఎప్పుడు ఉపఎన్నికలు జరిగినా.. పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే అన్నట్లుగా ఉండేది. దుబ్బాక, హు?జరాబాద్, మునుగోడు వంటి చోట్ల ఇదే జరిగింది. కానీ జూబ్లిహిల్స్ కు వచ్చే సరికి ఆ పార్టీ నెమ్మదిగా ఉంది. అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఎన్డీఏ కూటమిలో ఉన్న తెలుగుదేశం పార్టీకి జూబ్లిహిల్స్ లో బలం ఉంది. అందుకే ఆ పార్టీ మద్దతు కోసం కూడా బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గతంలో కేటీఆర్ లోకేష్ తో సమావేశమయ్యారన్న ప్రచారం జరిగింది. మాగంటి గోపీనాథ్ టీడీపీ నేత. దశాబ్దాల పాటు టీడీపీలో ఉన్నారు. ఆయన సతీమణి కే టిక్కెట్ ఇచ్చారు కాబట్టి టీడీపీ క్యాడర్ సహకరిస్తుందని అనుకుంటున్నారు. ఇదే అనుమానాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి కూడా వెలిబుచ్చారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గం పూర్తిగా అర్బన్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు గేమ్ ఛేంజర్ గా ఉన్నారు. అదే సమయంలో ఇతర వర్గాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ గట్టిగా తలపడే అవకాశాలు ఉన్నాయి. మిగతా పార్టీలు పోటీలో ఉంటాయా.. పోటీలో లేకపోతే ఎవరికి ప్రత్యక్షంగా లేదా .. పరోక్షంగా సపోర్టు చేస్తాయన్నది ఎన్నికల ఫలితాలను తేల్చనుంది. అందుకే అన్న ?రాజకీయ పార్టీలు తెర వెనుక ప్రయత్నాల్లో బీజీగా ఉన్నాయి.

# మళ్లీ రెచ్చిపోయిన సుగాలీ

కర్నూలు, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
మరోసారి సుగాలి ప్రీతి కేసు తెరపైకి వచ్చింది. ఆమె తల్లి పార్వతి దేవి ఈరోజు మీడియా ముందుకు వచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ జి సినిమాలో డైలాగ్ చెబుతూ పవన్ కళ్యాణ్ పై ఓ రేంజ్ లో విరుచుకుపడ్డారు. తమ కుటుంబానికి న్యాయం చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని.. తన కుమార్తెకు న్యాయం చేయలేకపోయారని విమర్శలు చేశారు. గతంలో సైతం ఇదే తరహా ఆరోపణలు చేసిన సుగాలి పార్వతీదేవి.. జనసేన కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. అయితే తన పోరాట ఫలితం వల్లే నాడు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సుగాలి ప్రీతి కుటుంబానికి భూమితో పాటు ఇళ్ల స్థలం, బాధితురాలు తండ్రికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు పవన్ కళ్యాణ్. కాచిన చెట్టుకి రాళ్ల దెబ్బలు అన్నట్టు.. ఆ కుటుంబం కి అండగా నిలిచినందుకు తనపై విమర్శలు చేయడం బాధాకరమని చెప్పుకొచ్చారు. అయినా సరే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై మరోసారి విమర్శలకు దిగడం హాట్ టాపిక్ అవుతోంది. కర్నూలు జిల్లాలో 2017లో సుగాలి ప్రీతి అనే విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి రెసిడెన్షియల్ హైస్కూల్లో పదోతరగతి చదువుతున్న ఆమె అదే ఏడాది ఆగస్టు 18న ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. సుగాలి ప్రీతిని అత్యాచారం చేసి.. హత్య చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్కూల్ యాజమాన్యంతో పాటు యజమాని కుమారులపై ఆరోపణలు వచ్చాయి. అయితే విచారణలో భాగంగా కేసు అనేక మలుపులు తిరిగింది. యజమాని తో పాటు ఆయన కుమారులు కేసులో అరెస్టయ్యారు. కొద్ది రోజులకే బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే ఈ కేసు విషయంలో పవన్ కళ్యాణ్ 2020లో స్పందించారు. కర్నూలులో ర్యాలీ చేశారు. కూటమి అధికారంలోకి వస్తే మొదటి కేసుగా పరిగణలోకి తీసుకొని విచారణ చేపడతామని.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. అటు తరువాత వైసిపి ప్రభుత్వం స్పందించింది. సిబిఐ తో విచారణ చేపడతామని చెప్పుకొచ్చింది. కానీ రకరకాల కారణాలు చెబుతూ విచారణ ప్రారంభం కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీబీఐ కేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. అది మొదలు సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా మరోసారి సుగాలి ప్రీతి తల్లి పార్వతి దేవి మీడియా ముందుకు వచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశామని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ గొప్పలు చెబుతున్నారని.. కానీ తమ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. అసలు పవన్ కళ్యాణ్ ఒక్కసారైనా అసెంబ్లీలో ఈ విషయం మాట్లాడారా అని నిలదీశారు. అసలు పవన్ కళ్యాణ్ ఎందుకు సైలెంట్ గా ఉన్నారని ప్రశ్నించారు

# ఎన్డీఏకు అనుకూలంగా పరిస్థితులు

పాట్నా,భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకొచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ పాలసీలు, కుల ఓటు బ్యాంకులు, తటస్థ ఓటర్ల ప్రవృత్తి ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. గత సర్వేల్లో మహాఘట్‌బంధన్‌కు విజయావకాశం ఉన్నట్లు ఒపీనియన్ పోల్స్ వచ్చినా.. ఇటీవలి మార్పులు ఎన్‌డీఏకు అనుకూలంగా మారుతున్నాయి. బిహార్‌లో నవంబర్ 6న మొదటి దశలో 18 జిల్లాల్లోని 108 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఇందులో ఉత్తర, మధ్య, పశ్చిమ, దక్షిణ బిహార్‌లోని కొన్ని ముఖ్య నియోజకవర్గాలు చేరుతాయి. దర్భంగా, ఆరా, బిహార్‌షరీఫ్, నలంద, బక్సర్, చాప్రా, పట్నా వంటి ప్రాంతాలు ఇక్కడ భాగస్వామి. ఈ జిల్లాలు బీజేపీ, జేడీయూ కలిసి బలమైన పట్టు కలిగిన ప్రదేశాలుగా పరిగణించబడతాయి. రెండో దశలో, నవంబర్ 11న 20 జిల్లాల్లోని 120 స్థానాలకు ఓటింగ్ జరుగుతుంది. రక్సాల్, సుపౌల్, కటిహార్, కిషన్‌గంజ్, పూర్ణియా వంటి సరిహద్దు జిల్లాలు ఇక్కడ ప్రధానంగా ఉంటాయి, ఇవి ముస్లిం జనాభా ఆధిక్యత కలిగిన ప్రాంతాలు. మొత్తంగా రెండు విడతల్లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ విభజన ప్రథమ దశలో ఎన్‌డీఏకు అనుకూలంగా, రెండో దశలో మహాఘట్‌బంధన్‌కు అవకాశాలు కల్పిస్తుందని విశ్లేషకులు అంచనా. బిహార్‌లో రెండు కూటములు ప్రధానంగా ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డీఏ (బీజేపీ?జేడీయూ), ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ (ఆర్‌జేడీ?కాంగ్రెస్). ఈ కూటముల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అంచనా. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక, సీటు పంపిణీలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ కసరత్తు కూటముల మధ్య సమతుల్యతను పరీక్షిస్తుంది. ఎల్‌జేపీ విభజన, ఈ ప్రక్రియను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఫలితంగా, చిన్న పార్టీలు ఓట్లను చీల్చే అవకాశం పెరిగింది. ప్రీ పోల్ సర్వేలు ఎన్‌డీఏ, మహాఘట్‌బంధన్ మధ్య సమాన పోటీని సూచించాయి, అయితే మహాఘట్‌బంధన్‌కు స్వల్ప ఆధిక్యం (52%) ఎన్డీఏకు (38%) ఉందని ఒపీనియన్ పోల్స్ చెప్పాయి. కానీ సెప్టెంబర్ నుంచి పరిస్థితి మారింది. నీతీష్ కుమార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ముఖ్యంగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) వ్యవస్థ, ఓటర్ల మనసులను ఆకర్షించాయి. మహిళల ఖాతాల్లో ఆగస్టు?సెప్టెంబర్‌లో బదిలీలు సమయానికి చేయబడటం, యువతకు రూ.10 వేల సహాయ పథకం ప్రారంభం వంటివి ఈ మార్పుకు మూలం. నీతీష్‌కు రాష్ట్రవ్యాప్తంగా భావోద్వేగ సానుభూతి ఉండటం వల్ల, కూటమి మార్పులు జరిగినా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇది ఎన్‌డీఏకు మొత్తం బలాన్ని పెంచుతూ, పోటీని ఒక్కసారిగా మలుపు తిప్పుతోంది. బిహార్ ఎన్నికలు కుల ఆధారిత ఓటు బ్యాంకుల చుట్టూ తిరుగుతాయి. మహాఘట్‌బంధన్‌కు ముస్లిం సమాజం (17%), యాదవులు (14%) ప్రధాన మద్దతు. అయితే చదువుకున్న యువ యాదవులు స్వల్పంగా ఎన్‌డీఏ వైపు మొగ్గు చూపవచ్చు. ఎన్‌డీఏ వైపు అగ్రవర్ణాలు, ఓబీసీలు బలంగా ఉంటారు. దళితులు (20%)లో మూసహార్ కమ్యూనిటీ (5%)కు హిందుస్తాన్ అవామీ మోర్చా, ఆర్‌జేడీ, ఎల్‌జేపీ (ఇది రెండు భాగాలుగా విభజించబడి, ఒకటి కాంగ్రెస్‌తో, మరొకటి బీజేపీతో) మద్దతు ఉంది. చమార్ సమాజం మహాఘట్‌బంధన్‌కు సానుకూలం. ఈ స్పష్టమైన విభజనల మధ్య తటస్థ ఓటర్లు, చిన్న పార్టీల ప్రభావం కీలకం. జన్ సురాజ్ పార్టీ (ప్రశాంత్ కిశోర్) మద్దతు 10% నుంచి 6%కి తగ్గడం, ఎన్‌డీఏకు అనుకూలం. ఆప్ అన్ని స్థానాల్లో పోటీ ప్రకటించడం వల్ల ఓట్లు చీలే అవకాశం ఉంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు విభజించబడితే, జేడీయూ?బీజేపీ కలిసి మెజారిటీ సాధించవచ్చు. ఇక ఇప్పటి వరకు మోదీ రంగంలోకి దిగలేదు. ఆయన కూడా బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ తరపున నాలుగైదు సభలు నిర్వహించే అవకాశం ఉంది. డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం చాలా రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికల్లో కూడా అదే నినాదంతో ముందుకు సాగే అవకాశం ఉంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో మోదీ వచ్చిన తర్వాత పరిస్థితులు మరింత మారుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 67 స్థానాలు 3 వేల ఓట్ల మెజారిటీతోనే నిర్ణయించబడ్డాయి, ఇది ఈసారి కూడా హోరాహోరీ పోటీ సూచిస్తోంది. తటస్థ ఓటర్లు తగ్గుతున్న నేపథ్యంలో, పథకాలు, నాయకుల ఇమేజ్ ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా, ఎన్‌డీఏకు స్వల్ప ఆధిక్యం కనిపిస్తున్నా, మహాఘట్‌బంధన్ సరిహద్దు ప్రాంతాల్లో బలపడితే సస్పెన్స్ కొనసాగుతుంది. ఈ ఎన్నికలు బిహార్ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తాయని అంచనా.

# వరంగల్‌లో రైల్వే మెగా డిపో

వరంగల్ భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
తెలుగు రాష్ట్రాల్లో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా సరకు రవాణా సామర్థ్యం పెంచేందుకు రూ.1,361 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో రూ.908 కోట్లతో మహబూబాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే చరిత్రలోనే తొలిసారిగా మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు కానుంది. ఇది రైళ్ల నిర్వహణను వేగవంతం చేసి, ఉపాధి అవకాశాలను పెంచుతుంది.దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కీలకమైన రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా సరకు రవాణా రైళ్ల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా రూ.1,361 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సౌత్ సెంట్రల్ రైల్వే మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తం నిధుల్లో సింహభాగం అంటే రూ.908.15 కోట్లు తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న మహబూబాబాద్‌లో మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు కోసం కేటాయించారు. సౌత్ సెంట్రల్ రైల్వే చరిత్రలో ఈ తరహా మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు కావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ఈ మెగా డిపో అందుబాటులోకి వస్తే సరకు రవాణా రైళ్లకు సంబంధించి అన్ని రకాల కీలక నిర్వహణ పనులు ఇక్కడే జరుగుతాయి. ఇందులో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్, రెగ్యులర్ ఓవర్ హాలింగ్ వంటి ప్రధాన నిర్వహణ కార్యకలాపాలు, అలాగే సిక్ లైన్, ట్రైన్ ఎగ్జామినేషన్ వంటి అత్యాధునిక సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా సరకు రవాణా రైళ్ల మరమ్మత్తులు, తనిఖీలు మరింత వేగంగా, సమర్థవంతంగా పూర్తవుతాయి.అంబ్రెల్లా వర్క్ కింద మంజూరైన ఈ ప్రాజెక్టులు తెలుగు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు ఎంతో బలాన్నిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. రైల్వే మౌలిక సదుపాయాలు విస్తరించడం వలన రైళ్ల ఆలస్యం తగ్గుతుందని.., సరకు రవాణా వేగం పెరుగుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాకు



ఈ డిపో రాకతో ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు, స్థానిక పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అంటున్నారు. ఈ మెగా డిపో ద్వారా సరకు రవాణా వ్యవస్థ మరింత పటిష్టమై, కేంద్ర ప్రభుత్వ గతిశక్తి మిషన్ లక్ష్యాలను చేరుకోవడానికి సౌత్ సెంట్రల్ రైల్వేకు ఒక కీలకమైన చర్యగా పరిగణించవచ్చునని చెబుతున్నారు. త్వరలోనే ఈ రైల్వే మెగా డిపో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ముందుకు సాగని కాజీపేట రైల్వే పనులు

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద చేపట్టిన సుమారు రూ.36 కోట్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభమై సంవత్సరం దాటినా.. ఒక్క రెండో తరగతి వెయిటింగ్ హాల్ మినహా మిగతా నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్లాట్‌ఫారాల ఆధునీకరణ, షెడ్ల నిర్మాణం, ఆధునిక కాలినడక వంతెన, స్టేషన్ ప్రాంగణం విస్తరణ వంటి పనులను ఈ పథకంలో భాగంగా చేపట్టారు. అయితే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు కేటాయించిన నిధుల్లో కొంత భాగాన్ని జనగామ, వరంగల్ రైల్వే స్టేషన్లకు పంపిణీ చేయడంతో పనుల వేగం తగ్గిందని తెలుస్తోంది. నిధుల కొరత కారణంగానే పనులు మధ్యలో ఆగిపోయాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి.కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి నిత్యం సుమారు 15,000 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా, స్టేషన్ ప్రాంగణంలో మొదలుపెట్టిన పనులు మధ్యలోనే ఆగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా, ప్లాట్‌ఫారాలపై షెడ్లు సరిగా లేకపోవడంతో వర్షం పడితే ప్రయాణికులు తడిసిపోతున్నారు. మరుగుదొడ్లు కూడా నిర్మాణ దశలో ఉండటంతో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. అభివృద్ధి పనుల్లో ప్రధాన అడ్డంకులుగా కొన్ని కార్యాలయాల తరలింపు నిలిచింది.ఒకటో నంబరు ప్లాట్‌ఫారం చివర ఉన్న రైల్వే మెయిల్ సర్వీసు కార్యాలయాన్ని తొలగించి, ప్లాట్‌ఫారాన్ని విస్తరించాల్సి ఉంది. కొత్త భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ.. గుత్తేదారు దాన్ని అప్పగించకపోవడంతో ఆర్ఎంఎస్ తరలింపు ప్రక్రియలో ఆలస్యం జరుగుతోంది.

రైల్వే స్టేషన్ ప్రాంగణం పూర్తిగా అస్తవ్యస్తంగా, గుంతలమయమైన రోడ్డుతో వాహనాల రాకపోకలకు కష్టంగా ఉంది. ఇక్కడ ఉన్న రన్నింగ్ రూం, ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని తొలగించాల్సి ఉంది. ఈ ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి సంబంధించి కొత్త భవనాన్ని ప్లాట్‌ఫారం మీద నిర్మించాల్సి ఉంది. దీనికి మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.మొదట స్టేషన్ లోపలి పనులను ప్లాట్‌ఫారాలు, షెడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు/ఎస్కేలేటర్లు పూర్తి చేసి, ఆ తర్వాత స్టేషన్ ముందు భాగాన పనులు చేపట్టాలని రైల్వే శాఖ యోచిస్తున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. కానీ, ఈ పనుల ఆలస్యం మాత్రం ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. అధికారులు త్వరితగతిన నిధులు విడుదల చేసి.. పనుల్లో వేగం పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు

## సోలో బతుకే సో బెటర్
# కమలం దారి అదేనా

హైదరాబాద్, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
తెలంగాణ బీజేపీ ఒక విషయంలో మాత్రం స్పష్టంగా ఉంది. ఏ ఎన్నిక జరిగినా ఒంటరి పోరాటానికే సిద్ధమవుతుంది. మిగిలిన



పార్టీల నేతలను తమలో కలుపుకుని మరింత బలోపేతమై తెలంగాణ రాష్ట్రాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ తెలంగాణలో మాత్రం అందుకు ససేమిరా అంగీకరించడం లేదు. సొంతంగా తెలంగాణలో ఎదగడమే దాని అసలు లక్ష్యంగా కనిపిస్తుంది. రాష్ట్ర నాయకులు మాత్రమే కాదు.. కేంద్ర నాయకత్వం కూడా ఈ విషయంలో ఒకే మాట.. ఒకే తీరు. తమకు ఎవరితోనూ పొత్తు అవసరం లేదన్న అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేస్తున్నారంటే బీజేపీ లో అంత కాన్ఫిడెన్స్ ఎందుకు పెరిగిందన్న దానిపై రాజకీయంగా చర్చ జరుగుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ఒంటరి పోరు చేయాలని నిర్ణయించింది. . 2014కు ముందు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఉమ్మడి రాష్ట్రంగా ఉండేవి. అప్పుడు పార్టీ అధ్యక్ష పదవిలో ఎవరున్నప్పటికీ రెండు చోట్ల పెద్దగా పార్టీకి ఎదుగుదల కనిపించలేదు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మాత్రం ఆంధ్రప్రదేశ్ లో తన బలాన్ని ఏ మాత్రం పెంచుకోలేకపోయింది. అయితే అక్కడ కూటమిని కట్టింది. తెలుగుదేశం పార్టీ, జనసేనతో కలసి అధికారంలోకి రాగలిగింది. అవసరమైన స్థానాలను పొందగలిగింది. రాష్ట్ర విభజన జరిగిన తొలి ఎన్నికలోనూ టీడీపీ, బీజేపీ కలసి పోటీ చేసి అధికారంలోకి రాగలిగాయి. 2019 ఎన్నికల్లో విడిగా పోటీ చేసి ఓటమిని చవిచూశాయి. బీజేపీకి అయితే ఒక్క శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందుకే 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలసి సూపర్ విక్టరీని సాధించాయి. దసరా షాపింగ్ గ్రైడ్రెడీ అయిపోండి దొరా సొంతంగా గ్రాఫ్ పెంచుకునేలా... ఇక తెలంగాణలోకి వచ్చేసరికి బీజేపీ గ్రాఫ్ సొంతంగా పెంచుకుంటూ పోతుంది. 2014 ఎన్నికల్లో కొన్ని సీట్లను గెలిచిన బీజేపీ 2018 శాసనసభ ఎన్నికల్లో మాత్రం కేవలం ఒక్క స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే 2023 ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా భారతీయ జనతా పార్టీ ఎనిమిది స్థానాల్లో గెలిచింది. అలాగే 2024 పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించి మరింత గ్రాఫ్ ను మెరుగుపర్చుకుంది. అందుకే ఏపీలో కూటమి ఉన్నప్పటికీ, తెలంగాణలో మాత్రం తెలుగుదేశం పార్టీ, జనసేనలతో పొత్తు ఉండబోదని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. తెలంగాణలో ఆ రెండు పార్టీలు సీమాంధ్రకు చెందిన పార్టీలుగా గుర్తింపు పొందడంతో దూరం పెట్టారన్నది వాస్తవం. వచ్చే నెలలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది.ఈ ఎన్నికలోనూ బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు లేవన్నది పార్టీ నేతల అభిప్రాయంగా ఉంది. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో టీడీపీతో పాటు సినిమా వాళ్లు ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ రెండు పార్టీలతో పొత్తుకు కమలనాథులు సిద్ధంగా లేరన్నది వాస్తవం. ఒక్కసారి పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా ఆంధ్ర సెంటిమెంట్ ను ప్రత్యర్థులు పైకి ఎగదోసే అవకాశముందని భావించి పొత్తు లేదని ముందుగానే నేతలు కుండబద్దలు కొట్టేస్తు?న్నారు. కూటమి అంత వరకే ఉంటుందని, బార్డర్ దాటి ఇటు వైపు మాత్రం రాదని తెలంగాణ బీజేపీ నేతలు నమ్మకంగా చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఒంటరిపోరాటమేనని స్పష్టం చేస్తున్నారు.

# సమ్మక్క, సారలమ్మ వర్శిటీ పనులు ప్రారంభం

వరంగల్ భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద ప్రతిష్టాత్మక సమ్మక్క సారలమ్మ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన ముఖ్య ఘట్టం జరిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈ సందర్భంగా కీలక ప్రకటన




చేశారు.ఈ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడతాయని, ముఖ్యంగా గిరిజన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ప్రతిభను పెంచుకునేందుకు ఇదొక బలమైన వేదిక అవుతుందని ఆమె అన్నారు. రూ. 24 కోట్ల వ్యయంతో 8.4 కిలోమీటర్ల పొడవైన ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జి. నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారుమంత్రి సీతక్క మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అగ్ర ప్రాధాన్యం ఇస్తుందని.. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం ఆధునిక గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, తరగతి గదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ములుగు జిల్లాకు ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేక గౌరవాన్ని, విద్యా రంగంలో కొత్త మైలురాయిని అందిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. ఈ నూతన విశ్వవిద్యాలయంలో 80 శాతం ప్రవేశ అవకాశాలు స్థానిక విద్యార్థులకే దక్కుతాయని స్పష్టం చేశారు. ఇది ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు
.ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు నాగేష్.. ఈ ప్రాంత గిరిజనుల విద్యాభివృద్ధి, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశ్వవిద్యాలయం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే.. ఇది ఆర్థిక అభివృద్ధిలోనూ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ.. రాబోయే ఐదేళ్లలో 3 వేల నుంచి 5 వేల మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసించవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం 42 మంది విద్యార్థులు కేంద్రీయ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు పొంది విద్యనభ్యసిస్తున్నారని, వారికి నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్ సెంటర్ ద్వారా శిక్షణ కూడా అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పార్టీకి ఇబ్బందిగా మారిన మంత్రుల గొడవలు

హైదరాబాద్, అక్టోబరు 8,
కాంగ్రెస్ పార్టీకి శత్రువుల ఎవరూ ఉండరు. ప్రత్యర్థులు కూడా ఎవరూ ఏమీ చేయలేరు. కానీ కాంగ్రెస్ ఓటమికి మాత్రం కారణం ఆ పార్టీనేతలేనని చెప్పాలి. జనం ఓట్లేసి గెలిపించి అధికారాన్ని అప్పగించినా దానిని నిలుపుకోవడం చేతకాని ఏకైక పార్టీ ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఎవరు వారు తోపులు. తమవల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న ఫీలింగ్ బలంగా నేతల్లో ఉంటుంది. అందుకే వారు ఏమాట్లాడుతున్నారో.. ఎవరికీ అర్థం కాదు. గతంలో మాదిరి కాదు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు చేరుతున్నాయి. భయం లేదు.. భక్తి లేదు.. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ నేతలే శత్రువులు అని చెప్పడానికి సందేహం లేదు. ఒక్కోసారి వారు చేసే వ్యాఖ్యలు పార్టీ పతనానికి కూడా దారి తీస్తాయి. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలువైరల్ గా మారాయి. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆలస్యంగా సభకు రావడంతో పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు మీడియా మైకులు క్యాచ్ చేశాయి. అంతటి పరుష పదజాలాన్ని నిజంగా పొన్నం ప్రభాకర్ గతంలో ఎన్నడూ ఉపయోగించలేదు. స్టూడెంట్ యూనియన్ నుంచి వచ్చిన నేత కావడంతో ఆచి తూచి వ్యవహరించే నేతగా పార్టీలో గుర్తింపు పొందిన పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఒక సామాజికవర్గం వారిని కించపర్చే విధంగా మారాయి. కానీ తాను అడ్లూరి లక్ష్మణ్ గురించి మాట్లాడలేదని పొన్నం ప్రభాకర్ ఇప్పటికీ సమర్థించుకుంటున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ లది ఒకే జిల్లా. ఇద్దరూ కరీంనగర్ జిల్లాకు చెందిన నేతలు కావడంతో ఏదైనా పాత పగలు ఉన్నాయేమోనని కార్యకర్తలు కూడా భావిస్తున్నారు. కానీ అడ్లూరి లక్ష్మణ్ మాత్రం తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వాడిని కాబట్టి, మంత్రి పదవి వచ్చిందని పొన్నం ఇటువంటి వ్యాఖ్యలు చేశారంటున్నారు.

# నల్గొండలో సై అంటున్న పార్టీలు

నల్గొండ, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8: ఎప్పుడు వస్తాయని వేచి చుసిన స్థానిక సంస్థల ఎన్నికలు రానే వచ్చాయి. రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రామాల్లో , పట్టణాల్లో ఎన్నికల సందడి మొదలైంది. గురువారం హైకోర్టు ఏం తీర్పు ఇవ్వబోతుందోందన్న ఆందోళన రాజకీయ నాయకుల్లో, ఆశావహుల్లో మొదలైంది. కొంతమందికి రిజర్వేషన్లు అనుకూలిస్తే మరి కొంతమందికి ఆశలుఅడియాశలయ్యాయి.దింతో రాజకీయ రణరంగం మొదలైంది. అధికార ప్రతిపక్ష పార్టీలకు దరఖాస్తుల విలువ మొదలైంది. ఒక ఎంపీటీసీ, జడ్పిటిసి పదవికి సుమారు పదిమంది ఆశావహులు దరఖాస్తులు చేసుకుంటున్నారు.అధికార ప్రతిపక్ష పార్టీలలో టికెట్ ఎవరికీ వస్తుందోఅని ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఎవరికివారు ప్రయత్నాలు, పైరవి లు మొదలుపెట్టారు. విడి,విడిగా గ్రామాలలో గుంపులు గుంపులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.కులాల వారిగా మతాల వారీగా పార్టీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం మొదలయ్యాయి. నేను పోటీలో ఉన్నానని సంకేతాలు ప్రజల్లోకి తీసుకు వెళుతున్నారు.ఆశాహహులుఖర్చు చేయడం మొదలుపెట్టారు.నేనున్నానంటే నేనున్నానంటూ పోటీ పడుతూ చాప కింద నీరులగా ఇంటింటికి ప్రచారం మొదలుపెట్టారు.. దరఖాస్తులతో అధికార ప్రతిపక్ష పార్టీలకు ఒక తలనొప్పి లాగా మారింది. ఒకరికి టికెట్ ఇస్తే మిగతావారని ఎలా బుజ్జగించాలో తెలియని పరిస్థితి.బుజ్జగింపులకు ఒప్పుకుం టారా లేక వ్యతిరేకంగా పనిచేస్తారా తెలియని ఆందోళన మొదలైంది.కొంతమంది టికెట్ దక్కపోతే ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని సంకేతాలు ఇస్తున్నారు. ఏది ఏమైనా ఈ స్థానిక సంస్థల్లో ఏం జరగబోతుందో అని వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల ఎన్ని కల కోసం సర్పంచి, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారుయ్యాయి. నకిరేకల్అసెంబ్లీనియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు 12, సర్పంచి, ఎంపీటీసీ స్థానాలు 201 ఉన్నాయి. వీటిలో మొత్తం మహిళలకు 78 స్థానాలను రిజర్వు చేశారు. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో ఐదు, సర్పంచి, ఎంపీటీసీ స్థానాల్లో 73 మహిళలకు దక్కాయి.




మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు..
నకిరేకల్ మండలం 9స్థానాల్లో 4స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 2, బీసీ- 4, జనరల్- 3 స్థానాలు ఉన్నాయి.
కేతపల్లి మండలం 11 స్థానాల్లో04స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 3, బీసీ- 5, జనరల్- 3 స్థానాలు ఉన్నాయి.
కట్టంగూర్ మండలం 13 స్థానాల్లో 6స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 3, బిసి- 6, జనరల్- 4 స్థానాలు ఉన్నాయి.
నార్కట్‌పల్లి మండలం 15 స్థానాల్లో07స్థానాలనుమహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 03,బీసీ-06, జనరల్- 06 స్థానాలు ఉన్నాయి.
చిట్యాల మండలం 12 స్థానాలకు 5స్థానాలను మహిళలకురిజర్వ్ కేటాయించారు.ఎస్సి- 3, బిసి- 6, జనరల్ -6 స్థానాలు ఉన్నాయి.
రామన్నపేట మండలం 15 స్థానాలకు 3 మహిళా స్థానాలను రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 3, బీసీ-6, జనరల్ -6 స్థానాలు ఉన్నాయి
సర్పంచి స్థానాల రిజర్వేషన్లు.
నకిరేకల్ మండలం 17స్థానాల్లో 8స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ- 4, బీసీ- 3, జనరల్- 10 స్థానాలు ఉన్నాయి.
కేతపల్లి మండలం 16 స్థానాల్లో 7స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 4, బీసీ- 7 ,జనరల్- 5, స్థానాలు ఉన్నాయి.
కట్టంగూర్ మండలం 22 స్థానాల్లో 10 స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ-05, బిసి-09, జనరల్ 8 స్థానాలు ఉన్నాయి.
నార్కట్ పల్లి మండలం 29 స్థానాల్లో14స్థానాలను మహిళలకు రిజర్వ్ కేటాయించారు ఎస్సీ- 7, బీసీ-12, జనరల్- 10స్థానాలు ఉన్నాయి.
చిట్యాల మండలం 18 స్థానాలకు 08స్థానాలను మహిళలకురిజర్వ్ కేటాయించారు.ఎస్సి-03, బిసి- 08, జనరల్ -07 స్థానాలు ఉన్నాయి.
రామన్నపేట మండలం 24 స్థానాలకు08 మహిళా స్థానాలను రిజర్వ్ కేటాయించారు. ఎస్సీ-05 ,బీసీ-10, జనరల్ -09 స్థానాలు ఉన్నాయి
నియోజకవర్గంలో సర్పంచి స్థానాలు 126 ఉండగా మహిళలకు 39, బీసీలకు 49, ఎస్సీలకు 28, జనరల్ కేటగిరిలో 49 స్థానాలు రిజర్వు చేశారు.ఎంపీటీసీ స్థానాలు 75 గాను 34మహిళలకు కేటాయించారు. ఎస్సీలకు 16, బీసీలకు 32, జనరల్ కేటగిరిలో 27 స్థానాలకు రిజర్వు చేశారు. రిజర్వేషన్లు మారడంతో ఇంతకాలం ఆయా పదవులపై గంపెడాశలు పెట్టుకున్న నాయకులు నిరాశకు గురయ్యారు. రిజర్వేషన్ల ద్వారా కొత్త వారికి అవకాశాలు వస్తుండటంతో వారిలో ఆశలు పెరిగాయి. ప్రజలు ఎవరికి తీర్పు ఇవ్వనున్నరో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది

# మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి
## క్షీరాభిషేకం చేసిన పూసల సంఘం

మంథని భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
మంథని పూసల సంఘం భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయలు కేటాయించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు మంథని పూసల సంఘం ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి బుధవారం మంథని అంబేద్కర్ చౌక్ లో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పూసల సంఘం తాజా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి సమ్మయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలను ఆదుకున్న ఘనత ఒక శ్రీధర్ బాబుకి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పొదిల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముద్రకోలా తిరుపతి, ఉపాధ్యక్షులు పట్టం తిరుపతి, మంథని పూసల సంఘం ప్రధాన కార్యదర్శి కావేటి సమ్మయ్య, కోశాధికారి కావేటి శ్రీనివాస్, కార్యదర్శి చేని రవి,గుంటుపల్లి సతీష్, కావేటి పెద్ద సమ్మయ్య, కావేటి సారయ్య,కావేటి రాంబాబు, ముద్ర కోలా రమేష్ లతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
==============================

# దద్దరిల్లిన జాతీయ రహదారి



రాజస్థాన్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను తీసుకెళుతున్న ట్రక్కు, మరో ట్రక్కు ఢీకొన్నాయి. దీంతో మంటలు వ్యాపించి గ్యాస్ సిలిండర్లు పేలిపోయి ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ ఘటన జైపుర్–అజ్మేర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనతో సమీపంలోని వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. కొన్ని కిలోమీటర్ల మేర పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.
==============================

# వేధింపులకు పాల్పడ్డ వ్యక్తుల పై కేసు నమోదు

–బలవంతపు అత్యాచార యత్నం అనేది అవాస్తవం
–సూర్యాపేట రూరల్ ఎస్సై బాలు నాయక్

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 8:
వేధింపులకు పాల్పడ్డ వ్యక్తులపై కేసుల నమోదు చేసిన సంఘటన సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.రూరల్ ఎస్సై బాలు నాయక్ ఒక ప్రత్యేక ప్రకటనలు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి తాళ్లకాంపాడు గ్రామానికి చెందిన యువతి నిన్న సాయంత్రం ఇంటి నుండి వెళ్తుండగా వేరే బజార్లో తన దగ్గర బంధువులు ఇద్దరు వరసకు అన్నలు ఒకరు బావ వరస తనను వేధింపులకు గురి చేసినారని బావ వరస వ్యక్తి పట్టుకుని వేధిస్తుండగా తను గట్టిగా అరచేసరికి,వెనకాలే వస్తున్న వాళ్ళ అమ్మను చూసి ఆ ముగ్గురు వ్యక్తులు పారిపోయారని దరఖాస్తు చేయగా ఆ వ్యక్తుల పై పోక్సో చట్టం కింద సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగినది. ఎస్సై బాలు నాయక్ తెలిపారు.కేసు దర్యాప్తు లో ఉన్నది. యువతిపై బలవంతపు అత్యాచార యత్నం అనేది అవాస్తవం అని ఆయన పేర్కొన్నారు.సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయద్దు, పిర్యాది కథనం ప్రకారం బలవంతపు అత్యాచార యత్నం అనేది అవాస్తవం అని తెలిపారు. ఇతరుల గౌరవానికి భంగం కలిగే విధంగా అసత్య ప్రచారాలు చేయవద్దు అని ఎస్ఐ బాలునాయక్ ఈ సందర్భంగా కోరారు. వేదింపులకు పాల్పడ్డ వారు పోలీసు అదుపులో ఉన్నారు అని ఎస్ఐ తెలిపారు. ఎలాంటి బలవంతపు అత్యాచార యత్నం జరగలేదు అని పిర్యాదుదారులు పిర్యాదులో పేర్కొన్నారు.

# దేశ సంస్కృతి వారసత్వ సంపద కు విజ్ఞాన కేంద్రాలు మ్యూజియంలు

జాతీయ అంతర్జాతీయ చారిత్రిక సంఘటనలు జ్ఞాపకాలను పూర్వీకులసాహిత్యం సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించి నాటి వైభవం సాంఘిక ఆర్థిక పాలనా రక్షణ రంగాల మీద ప్రజలకు అవగాహన చైతన్య కలిగించుటలో మ్యూజియంలు కీలక పాత్ర ను పోషిస్తున్నాయి

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాలు సాంస్కృతిక వారసత్వసాంప్రదాయాల మీద ప్రజలకు అవగాహన కలిగించడానికి పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది .
భారతీయ జాతీయ సాంస్కృతిక వారసత్వ ట్రస్ట్ దేశములోని వివిధ మ్యూజియములను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తుంది.
ప్రపంచీకరణ నగరీకరణ
హైటెక్ సంస్కృతి పెరిగి జీవన శైలి లో మౌలిక.మార్పులు చోటుచేసుకున్నాయి .యువత లోసెల్ ఫోన్లకు అలువాటు పడిపోయారు .వీడియో గేమ్స్ ఆడుతూ మానవ సంబంధాలకు దూరమై ఒంటరి జీవితాలు గడుపుతూ మనుషులకు దూరంగా
మత్తు కు బానిసలై డ్రగ్ మాఫియా
కబంధ హస్తాల్లో చిక్కుకొని ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటన లు సమాజములో చోటు చేసుకోవడం శోచనీయం యువతమ్యూజియాలను సందర్శించే కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించాలి .పురాతన చరిత్ర వారసత్వం మీద అవగాహన కలిగిన యువత లో సహనం సామాజిక అవగాహన ధైర్యం సంఘీభావంఏర్పడి మెరుగైన సమాజ నిర్మాతలు తీర్చిదిద్దే సదస్సులు సమావేశాలు వర్క్ షాప్స్ ప్రభుత్వం యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ నిర్వహించాలి. యువశక్తి నీ దేశ పునర్నిర్మాణ సాధనంగా ఉపయోగిస్తే మానవ వరులవికాసానికి దోహదపడుతుంది.

విద్యాసంస్థలు విద్యార్థులకు మ్యూజియముల సందర్శన కార్యక్రమము పాఠ్యాంశంలో బాగంగాచేర్చాలి.నూతన విద్యావిధానంలోవిద్యా పాలన సంస్కరణలు చేపట్టాలి.
మన దేశ సంస్కృతి వారసత్వ ము చరిత్ర నాగరికత పూర్వీకులు అవలంబించిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నాడు వారు వాడిన పరికరాలు ఆయుధాలు యుద్ధ సామాగ్రి యుద్ధ వ్యూహాలు రాజ ఆస్తనాలు కోటలు నిర్మాణ పద్ధతి మన్నగు వాటిపై అవగాహన చైతన్యం కలిగించాలి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పురాతన వస్తువుల సేకరణ రక్షణ నిర్వహణ కొరకుప్రభుత్వాలు కృషి చెయ్యాలి.



ఇంటాక్ట్ మల్టీమీడియా పద్ధతులు ఉపయోగించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానం తో డిజిటల్ రూపములో.అందరికీ మ్యూజియంలు అందుబాటులోకి తేవాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలుపూర్తి అవుతున్న సందర్భంగా దేశ ప్రజలలో యువతలో విద్యార్థుల్లో
దేశ ఔన్నత్యం గురించి అవగాహన చైతన్య కలిగించి దేశ వారసత్వ రక్షకులుగా ప్రజలను తీర్చిదిద్ద జాతియబావన దేశభక్తి పునరుద్దరణకు దోహదపడే కార్యాచరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక శాఖ పురాతన చరిత్ర వారసత్వం రక్షణకు కృషి చేస్తూన్న ఆర్కియలోజీ పరిశోధక విభాగం నాటి సంస్కృతి సంప్రదాయాలు
వారసత్వ సంపద రక్షణకు బహుముఖ కృషి చెయ్యాలి.
ప్రభుత్వాలు పౌరసమాజం సమిష్టిగా ఉద్యమించి నాటి వారసత్వాన్ని నేటి తరానికి అందించే వారధి గా నిలువాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
9440245771 హైదరాబాద్

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు ప్రగడ గణేష్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 1,00,000/- జరిమానా

అనకాపల్లి (చోడవరం), అక్టోబర్ 8:
గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడు ప్రగడ గణేష్ కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు1,00,000/- జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో ఇంకా 2 సంవత్సరాలు 6 నెలల అదనపు సాధారణ జైలు శిక్ష విధిస్తూ, చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ ఈరోజు తీర్పు వెలువరించారు.
కేసు నేపథ్యం: 2015 నవంబర్ 11న ఉదయం 10 గంటల సమయంలో, చోడవరం పోలీస్ స్టేషన్‌కు చెందిన అప్పటి ఎస్సై బి.రమణయ్య సిబ్బందితో కలిసి చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద పక్కా సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో, వడ్డాది గ్రామం వైపు నుండి నిందితుడు ప్రగడ గణేష్ ఒఖ 05 ఒఖ 2799 నంబరు గల కారులో 5 గోనె బస్తాలలో 100 కిలోల గంజాయి రవాణా చేస్తున్నాడు. పోలీసులు రావడాన్ని గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటపడి పట్టుకుని చోడవరం పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 153/2015 కింద కేసు నమోదు చేశారు.దర్యాప్తులో నిందితుడు పాడేరు పరిసర ఏజెన్సీ ప్రాంతాల నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, గోనె బస్తాలలో నింపి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు రవాణా చేస్తున్నట్టు తేలింది. పోలీస్ బృందం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది.ఈ కేసులో అప్పటి ఎస్సై బి.రమణయ్య సమగ్ర దర్యాప్తు జరిపి, న్యాయస్థానంలో



అభియోగపత్రం దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూ.వెంకటరావు న్యాయస్థానంలో సమర్థంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, వాదనల ఆధారంగా న్యాయస్థానం ఈ రోజు పైశిక్షను విధించింది.జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, గంజాయి కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పోలీసు శాఖకు విజయంగా అభివర్ణిస్తూ, ఈ కేసులో కృషి చేసిన అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై బి.రమణయ్యకి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూ.వెంకటరావుకి, చోడవరం పోలీసులకు మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# భారత ప్రధాన న్యాయమూర్తి 'సీజేఐ గవాయ్'పై దాడి అమానుషం



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), అక్టోబర్ 08:
భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ గవాయ్ పై దాడి అమానుషమని, ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దారుణమైన దాడి అని, న్యాయవ్యవస్థ గౌరవం కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. హింస, బెదిరింపులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, మతోన్మాదం పరాకాష్టకు చేరిందనడానికి ఈ ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి దాడులపై ప్రజలు ఏకగ్రీవంగా ఖండించాలని, దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ దాడులకు వ్యతిరేకంగా బార్ అసోసియేషన్ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# లిప్పన్ కళారూపానికి ఆధునికత

– గీతంలో నెక్సస్ 2025 పేరిట సృజనాత్మకత, సంస్కృతి, సహకార వేడుక



సంగారెడ్డి, భారతశక్తి,ప్రతినిధి, అక్టోబర్ 8:
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ బుధవారం నెక్సస్ 2025 పేరిట సృజనాత్మకత, సంస్కృతి, సహకారం యొక్క ఉత్సాహభరితమైన వేడుకను నిర్వహించి, లిప్పన్ కళ యొక్క కాలాతీత ఆకర్షణను సమకాలీన వెలుగులోకి తీసుకొచ్చింది. శతాబ్దాల నాటి లిప్పన్ కళారూపాన్ని ఆధునిక లెన్స్ ద్వారా తిరిగి ఊహించుకుంటూ, సాంస్కృతిక వారసత్వాన్ని సమకాలీన డిజైన్ సున్నితత్వాలతో మిళితం చేశారు.ఈ కార్యక్రమంలో ఎనిమిది కళాశాలలకు చెందిన 55 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఒకరికి మరొకరు సహకరించుకోవడంతో పాటు ఇతరులతో పరిచయాలను పెంచుకుని, తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. సాంప్రదాయ చేతిపనుల యొక్క సాధారణ అన్వేషణగా ప్రారంభమై, ఆవిష్కరణ, బృంద కృషి, కళాత్మక వ్యక్తీకరణలతో కూడిన కాన్వాస్ గా పరిణామం చెందింది.
స్కెచ్ బుక్ లు సంక్లిష్టమైన నమూనాలతో రోజంతా వికసించాయి. నైపుణ్యం కలిగిన చేతుల కింద గాలికి ఎండిపోయిన బంకమట్టి రూపాంతరం చెంది, చేతిపనులను ప్రతిబింబించాయి. వర్ధమాన వాస్తుశిల్పులు శతాబ్దాల నాటి లిప్పన్ కళారూపాన్ని ఆధునిక మెరుగులద్దారు.నెక్సస్ లో పాల్గొన్న వారంతా తమ ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, నేటి నిర్మాణ, కళాత్మక వ్యక్తీకరణలలో సాంప్రదాయ మూలాంశాలు తాజా అర్థాన్ని ఎలా పొందవచ్చో అన్వేషించడంతో వాతావరణమంతా శక్తి, ఊహతో సజీవంగా మారింది. తత్ఫలితంగా, భారతదేశ కళాత్మక వారసత్వాన్ని, యువత ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబించే సృజనాత్మక ప్రదర్శనగా నిలిచిపోయింది.
ఈ కార్యక్రమాన్ని వీక్షా నోముల (యూనిట్ సెక్రటరీ, మూడో సంవత్సరం), జక్కిడి అద్వయ స్ఫూర్తి (యూనిట్ డిజైనర్, రెండో సంవత్సరం)తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రుతి గాల్లి సమన్వయం చేశారు.

# సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్స్ పై మరింత అవగాహన పెంచాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప,అక్టోబర్ 08(భారత శక్తి ) : ప్రభుత్వం తగ్గించిన జిఎస్టీపై ప్రజలకు పూర్తి స్థాయి లో అవగాహన కల్పించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందు కెళ్లాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. జిల్లాలో "సూపర్ జిఎస్టి – సూపర్ సేవింగ్స్" పై చేస్తున్న అవగాహన కార్యక్రమాల అమలు తీరు పై మున్సిపల్ కమిషనర్లు,ఎం పి డి ఓ లతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వీసీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు.ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్,జిఎస్టీ జాయింట్ కమిషనర్,జిల్లా సూపర్ జిఎస్టీ – సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి జి. సుమతి,జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. 4 వారాల షెడ్యూల్ ను సవివరంగా ప్రజలకు తెలియజేయాలన్నారు.ప్రతి రోజు చేసిన కార్యక్రమాలపై డేటా ఎంట్రీ ఖచ్చితంగా చేయాలని,ఈ కార్యక్రమం పై శ్రద్ధ పెట్టి పనిచేయాలని ఆదేశించారు.ఇంటింటికి వెళ్ళి జిఎస్టీ తగ్గింపు, తగ్గింపు వలన సేవింగ్స్ గూర్చి ప్రజలకు వివరంగా తెలియజేయాలని ఆదేశించారు.షెడ్యూలు ప్రకారం అన్ని శాఖలు జీఎస్టీ తగ్గింపు పై ప్రణాళికా ప్రకారం కార్యక్రమాలునిర్వహించాలన్నారు. జీఎస్టీ ఛాంపియన్లు ఎప్పటికప్పుడు షెడ్యూల్స్, డాక్యుమెంటేషన్ (ఎస్.జి .ఎస్.ఎస్ సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్)యాప్ లో అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఎలక్ట్రానిక్ మరియు గృహోపకరణాలు కంపెనీల అసోసియేషన్ ల వారితో మైదుకూరు,కడప, ప్రొద్దుటూరు,బద్వేలు,పులి వెందుల,జమ్మల మడుగు ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవ గాహన నిమిత్తం ప్రదర్శన ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ లను ఆదేశించారు..ఎం పి డి ఓ లు,మునిసిపల్ కమిషనర్ లు సూపర్ జి ఎస్టి– సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నకు ఒక నోడల్ అధికారి ని నియమించాలన్నారు.ఈ నెల 10 మరియు 11 వ తేదీ లలో కడప కళా క్షేత్ర ప్రాంగణం లో సూపర్ జి ఎస్టి –సూపర్ సేవింగ్స్ కార్యక్రమం లో భాగంగా ఎలక్ట్రానిక్ మరియు గృహోపకరణాల ప్రదర్శన మరియు సేల్స్ కార్యక్రమ నిర్వహణ కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధింత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
ఈ నెల 9 న అన్ని పి హెచ్ సి లలో కార్యక్రమ నిర్వహణ ను డాక్యుమెంటేషన్ చేయాలనితెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఓబులమ్మ, జిల్లా వైద్య శాఖ అధికారి నాగరాజు,డ్వామా,డిఆర్డిఏ పిడి లు ఆదిశేషారెడ్డి, డా.రాజ్యలక్ష్మి,డిఈఓ శంషుద్దీన్,జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ గురుకులాలకు తాళాలు వేసే దుస్థితి దుర్మార్గం: కేటీఆర్

గురుకులాల అద్దె బకాయిలు చెల్లించకపోవడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనంయావత్ దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ సంక్షేమ గురుకులాలకు అద్దె బకాయిలు పేరుకుపోయి, చివరికి భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు.విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి, గురుకుల భవనాలకు ఏకంగా ఏడాది కాలం నుంచి అద్దె బకాయిలు చెల్లించకపోవడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఈ అత్యుత్తమ వ్యవస్థను కుప్పకూల్చి, కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేయాలన్న కుట్రలో భాగంగానే సీఎం రేవంత్ ఇదంతా చేస్తున్నట్టు అనుమానం



కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెడుతున్న ముఖ్యమంత్రి, సంక్షేమ గురుకులాలను కూడా సమాధి చేసే పన్నాగం చేస్తే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన రెసిడెన్షియల్ వ్యవస్థను బలిపెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని కేటీఆర్ స్పష్టం చేశారు.
రేవంత్ రెడ్డి ఈ విషయం గుర్తుపెట్టుకుంటే మంచిదని ఘాటుగా వ్యాఖ్యానించారు. రెండేళ్లు నిండకుండానే రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్ రెడ్డి, కనీసం గురుకులాల అద్దె కిరాయి కూడా కట్టకుండా, ఆ సొమ్ముతో ఎవరి జేబులు నింపుతున్నాడో తక్షణమే లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేటలో జోరుగా కొనసాగుతున్న బాకీ కార్డుల పంపిణీ




సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 8:సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జోరుగా కొనసాగిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించారని తెలియజేస్తూ ముద్రించిన బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం సూర్యాపేటలో వాడవాడలో పంపిణీ చేస్తున్నారు.మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమానికి అన్ని రంగాల ప్రజల నుండి పూర్తి మద్దతు లభిస్తుందని పార్టీ నాయకులు అంటున్నారు.కాంగ్రెస్ బాకీ కార్డు లో పొందుపరిచిన అంశాలను ప్రజలే స్వచ్ఛందంగా తమకు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తో పాటు పలువురు బి ఆర్ ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో సూర్యాపేట శాసనసభ్యులు మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

# బాణసంచా గోడౌన్లలో భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైఎస్సార్ కడప జిల్లా, అక్టోబర్ 08(భారత శక్తి) : బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు ఫైర్, భద్రతా నిబంధనలు(సేఫ్టీ మెజర్స్) ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ రూమ్ హాలులో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు.. తదితర అంశాలపై..జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, డిఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలసి ఆర్డీవో, మున్సిపల్ కమిషన్స్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్ లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. కమ్యూనిటీ ఓపెన్ ఏరియాలలో క్రాకర్స్ వినియోగించేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల్లో పిల్లలకు టపాసుల వినియోగం, భద్రతపై అవగాహన పెంచాలన్నారు.

అలాగే ప్రజలందరూ సేఫ్టీ మేజర్స్ పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలన్నారు. అలాగే కమర్షియల్ టాక్స్ అధికారులు అన్ని డివిజన్లోని ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులతో సమావేశం నిర్వహించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. అలాగే అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ పర్మిషన్లు తదితర అంశాలపై సడన్ విసిట్లు నిర్వహించాలన్నారు.



ఎక్కడైనా ఇల్లీగల్ స్టోరేజ్ పాయింట్లు కనపడితే వెంటనే వాటిని చీజ్ చేసి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే లోకల్ క్రాకర్స్ తయారీ వంటి వాటిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 102,మెడికల్ క్యాంపులను అందుబాటులో ఉంచాలన్నారు.
ముఖ్యంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో.. బాణసంచా విక్రయ కేంద్రాలకు పరిమిత సంఖ్యలో అనుమతులు ఇవ్వాలని సంబందిత అధికారులకు సూచించారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే.. విక్రయదారులపై కేసులు నమోదు చేయాలనిసంబందిత మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు.విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో.. ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.
ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్,సాయి శ్రీ,చెన్నయ్య జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ ,మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలి:అదనపు కలెక్టర్ గడ్డం నగేష్.




రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 08 (భారత శక్తి) : సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏండ్లు అయిన సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆయా శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ఎలా అమలులోకి వచ్చింది, చట్టంతో ప్రజలకు ఉపయోగపడే వివరాలను తెలియజేశారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సమాచారం, ఉద్యోగుల విధులు,బాధ్యతలు తదితర సమాచారాన్ని తెలుసు కోవచ్చని స్పష్టం చేశారు. దేశ భద్రత, రహస్య ఇతర ఇబ్బందులు ఎదురయ్యే సమాచారం మినహా అన్ని ఇవ్వాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ఉండాలని తెలిపారు. ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సమాచారం ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం అంతా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కార్యక్రమాలు ప్రచారం చేయాలి: జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కరీంనగర్, అక్టోబర్ 8 (భారత శక్తి):
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో టీవీల ద్వారా ప్రచారాలు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సిబ్బందికి చెప్పారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ వెంకటరమణ పిఓ ఎమ్హెచ్ఎన్ డాక్టర్ సన జవేరియాతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం కేంద్రంలోని అటెండెన్స్ రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, రికార్డులను తనిఖీ చేశారు. ఎన్ సి డి క్లినిక్ లో వ్యాధుల రికార్డులను పరిశీలించారు. అందులో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును, మందులు ఇస్తున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ పేషెంట్ల తో మాట్లాడుతూ అధిక రక్తపోటు, షుగర్ వ్యాధికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను వాడుతున్నారా అని తెలుసుకుని అందరూ వాడుకోవాలని సూచించారు. మందుల ఖర్చులు తగ్గించుకొని, ఫార్మసీ స్టోర్స్ లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఐఇసి బోర్డును పరిశీలిస్తూ దానిపై ప్రదర్శించిన అధిక రక్తపోటు షుగర్ వ్యాధి మందులకు సంబంధించిన స్పెసిమెన్ లను అడిగితెలుసుకున్నారు. అలాగే ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఆరోగ్య కార్యక్రమాలని ప్రసారం చేస్తున్న టీవీ ప్రోగ్రాం ని పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందుల వివరాలు అడిగారు..మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగేటట్లుగా గర్భవతులను కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. పీహెచ్సీ డెలివరీ లను ఆరోగ్యవంతంగా తయారు చేయాలన్నారు..ఈ కార్యక్రమంలో చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోహర్ వైద్య సిబ్బంది ఉన్నారు.

# అక్రమ మొరం దందా, పట్టించుకోని అధికారులు

**-సొమ్ము చేసుకుంటున్న అధికారులు.**
**-ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ**



భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 8 (భారత శక్తి):చిట్యాల మండలంలోని నవాబ్ పేట గుట్టల్లో అక్రమ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలు గా విలసిల్లుతుందని ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమంగా మొరం తవ్వుతున్న గుట్టలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలను కొంతమంది వారి అక్రమ సంపాదన కోసం మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఈ దందా ఇలాగే కొనసాగితే పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తతంగం జరుగుతున్న సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని,ఇకనైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ మొరం తరలిస్తున్న వ్యక్తులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైతులకి ఇబ్బంది కలగకుండా చివరిగింజ వరకు ధాన్యం సేకరించాలి

**-ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో మౌలిక వసతులు కల్పించాలి.**
**-రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి.**
**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




సూర్యాపేట,భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 8:
రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలను ఆదేశించారు.ఖరీఫ్ ( వానాకాలం) 2025-26 సీజన్ కి సంబంధించి ధాన్యం కొనుగోలుపై బుధవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశం మందిరంలో ఐకెపి,పిఎసిఎస్, ఎఫ్ పి ఓ, మెప్మా శాఖలకు చెందిన కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఐకెపీ ద్వారా 158,పి ఏ సి ఎస్ ద్వారా 122,ఎఫ్ పి ఓ ద్వారా 15,మెప్మా ద్వారా 13 మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించాలని ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు.
కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతంలో ఉండకుండా ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని ప్రతి కేంద్రంలో వేయింగ్ మిషన్,విద్యుత్,త్రాగునీరు, ప్లెక్సీపై నిర్వాహకుల పేరు ఫోన్ నెంబర్, టార్పాలిన్ పట్టాలు, పాడి క్లీనర్లు, డ్రైయర్లు, ట్యాబ్ లాంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.
దాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరినప్పటి నుండి మిల్లులో దిగుమతి అయ్యేవరకు నిర్వాహకులదే బాధ్యత కాబట్టి నిర్వాహకులు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎక్కడైనా ఎక్కువ టార్పాలిన్ పట్టాలు అవసరం ఉంటే ముందస్తుగా సర్దుబాటు చేసుకోవాలని అన్నారు.జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేసినప్పుడు ఏమైనా సమస్యలు గుర్తిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది కాబట్టి గతంలో జరిగిన తప్పులు దొర్లకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.రైతులు కొనుగోలు కేంద్రాలకు గడ్డి,తాలు,దుమ్ము లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు.కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు మండలాల వారీగా షెడ్యూల్ తయారుచేసి ఎం ఎల్ ఎస్ పాయింట్ నుండి పంపిణీ చేయాలని సివిల్ సప్లై డిఎం ను ఆదేశించారు.
ధాన్యం కాంటా వేసిన తర్వాత వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించే విధంగా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.ఐ కే పి, పి ఏ సి ఎస్ , మార్కెటింగ్, మెప్మా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసి విజయవంతం చేయాలని,కలెక్టరేట్ లో కంట్రోల్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసి రైతుల నుండి ఫిర్యాదు అందగానే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ కే.సీతారామరావు
మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మిల్లర్ల ధర కంటే ఎక్కువ మద్దత్తు ధర కల్పిస్తుందని గ్రేడ్ ఎ ధాన్యం రకానికి రూపాయలు 2389, కామన్ రకానికి చెందిన ధాన్యానికి రూపాయలు 2369 మద్దతు ధర ఇస్తుందని అలాగే సన్న రకం వడ్లకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు బోనస్ కల్పిస్తుంది కాబట్టి రైతులు నష్టపోకుండా అన్ని ఏర్పాట్లను కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయాలని ఆకస్మిక వర్షాలు కురుస్తున్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ఏపీఎంలు,పి ఎస్ సి ఎస్ సి ఓ లు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు ఎన్ని అవసరం ఉంటే అన్ని సరఫరా చేసేలా చూసుకోవాలని, వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలు అన్ని ప్రారంభించేలాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశానికి డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము,డి సి ఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, రవాణా అధికారి జయప్రకాశ్ రెడ్డి, ఐకెపి,పి ఎస్ ఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# వ్యాయామంతో ఒత్తిడిని నివారించుకోవచ్చు: డాక్టర్ ఎం. రాజా



ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 8 (భారత శక్తి) : ఎదిగే విద్యార్థిని విద్యార్థులు వ్యాయామంతో ఇలాంటి ఒత్తిడినైనా నివారించుకోవచ్చని డాక్టర్ రాజా అన్నారు. ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ వెల్ బీయింగ్ పై ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ ఎం రాజా, పిల్లల వైద్య నిపుణులు, ములుగు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లోంచే బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.రాజా మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ఎటువంటి విషయాలైనా తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులతోపంచు కోవాలని పేర్కొన్నారు. సరైన ఆహార అలవాట్లు నియమాలు పాటించి శారీరకవ్యాయామాలు, యోగ చేయడం వల్ల మానసిక వ్యాధులకు దూరంగా ఉంటారని తల్లిదండ్రులు మిత్రులతో స్నేహపూర్వకంగా ఉండాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి చెడు అలవాటులకు లోను కాకుండా తమ లక్ష్యం పై దృష్టి పెట్టి భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కావాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు హెల్త్ అవేర్నెస్ కల్పించినందుకు డాక్టర్ ఏ రాజా,ములుగు లయన్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ములుగు ప్రభుత్వ బాలుర, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ములుగు లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ చుంచు రమేష్, ట్రెజరర్ లయన్ ఆడపు రాజు, లయన్ సోమనర్సయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బుధవారం బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబర్ 8(భారత శక్తి):
ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు కఠినమైన అంశాలు, పాఠాలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.
కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. జడ్పీహెచ్ఎస్ లో "బుధవారం బోధన"లో భాగంగా పదవ తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆంగ్ల పాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివించారు. పాఠాలు చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతుల్లో బోధన పకడ్బందీగా అమలు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ సమర్థవంతంగా నేర్చుకోవడానికి చక్కటి వేదిక అని తెలిపారు. విద్యార్థులు కష్టతరమైన పాఠం పట్ల బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ, అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.
అంగన్వాడీ కేంద్రం సందర్శన
నగునూరు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అంగన్వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులతో



ముచ్చటించారు. పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల సంఖ్య వంటి వివరాలు అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి పిల్లల హాజరు పెంచాలని ఆదేశించారు.
పల్లె దవాఖాన సందర్శన
నగునూర్ పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షల రిజిస్టర్ ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవల పట్ల గ్రామస్తులందరికీ అవగాహన కల్పించి, నూరు శాతం మందికి ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.
కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, తహసిల్దార్ రాజేష్, ఎంఈఓ రవీందర్ ఉన్నారు.

# మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు - నీలోఫర్ ఆసుపత్రి నుంచి ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, అక్టోబర్ 8:సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మైత్రి ఫౌండేషన్ సేవలకు గుర్తింపు లభించింది. నీలోఫర్ ఆసుపత్రిలో తలసేమియా పిల్లలు, గర్భిణీ స్త్రీల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు ఆసుపత్రి సిఎస్ నాగజ్యోతి, సూపరిండెంట్ విజయ్ కుమార్‌లు ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు.ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తమ సేవలకు లభించిన గౌరవమని, మాపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.



# జాతర అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి,(తాడ్వాయి) అక్టోబర్ 8 (భారత శక్తి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని సమ్మక్క సారలమ్మ దేవాలయ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఈ ఎన్ సి ప్రహరీ గోడ మార్కింగ్ ను కలెక్టర్ కు చూపించి పని పురోగతి ప్రణాళిక గురించి వివరించారు. బుధవారంమేడారం దేవాలయ ప్రాంగణ అభివృద్ధి పనులలో భాగస్వాములైన అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలన చేసి,భక్తుల సౌకర్యార్థం, రద్దీకి సంబంధించి చెయ్యాల్సిన పనుల పై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి సీఈ మోహన్ నాయక్, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలించిన వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు



భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 8 (భారత శక్తి) :భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన 2025%-%27 సంవత్సరాల ఏ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియను పర్యవేక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సులభతర దరఖాస్తు విధానం అమలు చేయాలని ఆయన ఆదేశించారు.అభ్యర్థులు సౌకర్యవంతంగా దరఖాస్తు చేసుకునేలా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచడం, అప్లికేషన్ ఫీజు చెల్లించేందుకు అవసరమైన చలానాలను సమయానికి జనరేట్ చేయడం మరియు దరఖాస్తుదారులకు మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. శ్రీనివాస్, భూపాలపల్లి, కాటారం, ములుగు, ఏటూరునాగారం స్టేషన్ల ఎక్సైజ్ సి.ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద ఎలక్ట్రిక్ కుండల తయారి చక్రాలు ఉపయోగించడం పై శిక్షణ



విజయవాడ, అక్టోబర్ 8(భారత శక్తి):ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర కార్యాలయం, విజయవాడ,రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్. గ్రిప్,ఆధ్వర్యంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద ఎలక్ట్రిక్ కుండల తయారి చక్రాలు ఉపయోగించడం పై శిక్షణా తరగతులు సిరి వేల్పూర్ గ్రామం, గుడివాడ మండలం,కృష్ణాజిల్లా నందు ప్రారంభించడం జరిగింది.ఈ శిక్షణా తరగతులు 07.10.2025 తేదీ నుండి 16.10.2025 తేదీ వరకు నిర్వహించుచున్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో 20 మంది వరకు శిక్షణ పొందుటకు ఏర్పాటు చేయడమైనది. అదేవిధంగా ఈ శిక్షణ ప్రారంభ సమయంలో 40 నుంచి 50 మంది వరకు పాల్గొనటం జరిగింది.ఈ కార్యక్రమానికి (కే వి ఐ సి)రాష్ట్ర సంచాలకులు విజయవాడ,డా. ఎస్. గ్రిప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.గ్రిప్ రాష్ట్ర సంచాలకులు,ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్, రాష్ట్రకార్యాలయం, విజయవాడ.ఎం. ప్రభాకర రావు,సిరి వేల్పూరు గ్రామ పంచాయతీ అధ్యక్షులు. శ్రీమతి అర్చన,సిరి వేల్పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆర్. ఎల్. ఎన్. మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్-%××%, ఎస్ ఓ, ( కే వి ఐ సి) విజయవాడ పాల్గొన్నారు.ఆశిష్ కుమార్ చౌదరి,ఎగ్జిక్యూటివ్, కేవిఐసి, విజయవాడ పాపయ్య, మాస్టర్ ట్రైనర్. వంశీ,శాలీవాహన సంఘంలోని వ్యక్తి డాక్టర్ ఎస్. గ్రిప్ రాష్ట్ర సంచాలకులు, ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్,రాష్ట్రకార్యాలయం, విజయవాడ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు ఉద్దేశం కుమ్మరులకు ఆధునిక ఎలక్ట్రిక్ కుమ్మరి చక్రాలు శిక్షణ ఇవ్వడం,తద్వారా గ్రామీణ ప్రాంతాలలో అధునాతన పనిముట్లతో వారి ఉత్పాదకతను మెరుగుపరచడం.ఈ శిక్షణా తరగతుల ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి ఎలక్ట్రిక్ కుమ్మరి చక్రాలను ఉపయోగించడంపై ఆచరణాత్మక మరియు సిద్ధాంతపరమైన పరిజ్ఞానం పెంచడం ముఖ్య ఉద్దేశం అని తెలియపరిచారు.ఎం.ప్రభాకర రావు,సిరి వేల్పూరు గ్రామ పంచాయతీ అధ్యక్షులు, మాట్లాడుతూ,అభ్యర్థులు ఈ పది రోజుల శిక్షణా తరగతుల్లో పాల్గొని ఆధునిక పరికరాల వినియోగాన్ని తెలుసుకొని తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడం అదేవిధంగా తమ ఉత్పత్తుల ద్వారా గణపవరం గ్రామం యొక్క ఖ్యాతిని పెంచాలని తెలియపరిచారు.అర్చన, సిరి వేల్పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, మాట్లాడుతూ,ఈ పది రోజుల శిక్షణా తరగతులు వినియోగం చేసుకుని ఆధునిక పద్ధతులు ద్వారా ఉత్పత్తి ఏ విధంగా పెంచుకోవాలి ఆధునిక యంత్రాలను ఏ విధంగా ఉపయోగించాలి తెలుసుకుని తమ యొక్క ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.ఆర్. ఎల్. ఎన్. మూర్తి,అసిస్టెంట్ డైరెక్టర్-%××%, ఎస్ ఓ, (కే వి ఐ సి) ,విజయవాడ, మాట్లాడుతూ , (కే వి ఐ సి) గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద సాంప్రదాయ గ్రామీణ చేతివృత్తుల వారిని గుర్తించి వివిధ రకాలైన చేతివృత్తులలో ఆదాయాన్ని పెంచుటకు మరియు ఆధునిక పద్ధతులను ఉపయోగించడంలో శిక్షణ ఇవ్వడం జరుగుచున్నది.గ్రామోద్యోగ్ వికాస్ యోజన కార్యక్రమం వల్ల, చేతివృత్తులవారు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి మరియు ఎక్కువ ఆదాయం మరియు తక్కువ శ్రమను పొందడం కొరకు మెరుగైన టూల్స్ /ఎక్విప్ మెంట్ పై పనిచేయుట ద్వారా ప్రయోజనం పొందుతారు. అదేవిధంగా శిక్షణ పొందిన వారందరికీ మెరుగైన టూల్స్ ఎక్విప్మెంట్ కూడా అందజేయడం జరుగుచున్నదని తెలియచేశారు.

# సినిమాలో పాములు..



## 'కార్తికేయ' చిత్రాన్ని వదులుకున్న నరేశ్

డెస్క్: మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన 'కార్తికేయ' చిత్రం టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేసింది. హీరో నిఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సుమారు రూ.6 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లు వసూళ్లు సాధించింది. మరి, ఈ సినిమాలో అల్లరి నరేశ్ నటిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి! ఎందుకంటారా..? ముందుగా ఈ కథను దర్శకుడు చందూ మొండేటి.. నరేశ్‌కే వినిపించారు. స్టోరీ తనకు బాగా నచ్చినా ఒక్క కారణంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించలేదు. అదేంటంటే.. సుబ్రహ్మణ్యపురం అనే గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పాములు ఎక్కువగా కనిపించిన సంగతి తెలిసిందే.

ఆ సన్నివేశాలే ఈ సినిమాకి కీలకం. వ్యక్తిగతంగా తనకు పాములంటే భయపడడం వల్ల నరేశ్ ఆ సినిమాని తిరస్కరించారట. ఓ ఇంటర్వ్యూలో ఆయనే ఈ వివరాలు పంచుకున్నారు. బయటేకాదు సినిమాల్లో కనిపించే పాముల దృశ్యాలను చూసినా ఇప్పటికీ భయపడతానన్నారు. 2014 అక్టోబరు 14న విడుదలైన ఈ సినిమాకి సీక్వెల్‌గా 'కార్తికేయ 2' రూపొందింది. 'కార్తికేయ' పార్ట్ 2 నిఖిల్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఒకవేళ అల్లరి నరేశ్ 'కార్తికేయ'లో నటించి ఉంటే అప్పటి నుంచే ఆయన సీరియస్ కథల్లో కనిపించేవారేమో. సీరియస్ లుక్‌లో ప్రేక్షకులు తనని అంగీకరిస్తారా, లేదా? అనే సందేహానికి 'మహర్షి' చిత్రంలో పోషించిన రవిశంకర్ పాత్ర జవాబుగా నిలిచిందని, ఆ క్యారెక్టరే పవర్‌ఫుల్ స్టోరీల్లో నటించేందుకు ధైర్యాన్నిచ్చిందని నరేశ్ మరో సందర్భంలోనూ పంచుకున్నారు.వరుసగా యాక్షన్ తరహా సబ్జెక్ట్‌లకే పరిమితం కాకుండా కామెడీ సినిమాలూ చేస్తుంటానని చెప్పారు.

## 'జయం మనదేరా'కు 25 ఏళ్లు..

### 'థమ్స్ అప్'తో ఉన్న లింక్ ఏంటో తెలుసా?



కులం కోసం కాదు... మనుషుల కోసం పోరాటం...! అనే మెసేజ్ ఇచ్చిన 'జయం మనదేరా' చిత్రానికి 25 ఏళ్లు. ఈ మూవీతో కులాల మధ్య అంతరాన్ని తగ్గించే మెసేజ్ ఓరియెంటెడ్ కథతో వెంకటేష్ మెప్పించారు. ఎన్.శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదలై నేటికి 25 సంవత్సరాలు పూర్తి అయింది. ఇందులో వెంకటేశ్ ద్విపాత్రాభినయంలో కనిపించగా భానుప్రియ, సౌందర్య కథానాయికలుగా నటించారు. సురేష్ ప్రొడక్షన్స్?పై డి. సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి వందేమాతరం శ్రీనివాస్ సంగీతం అందించారు.2000లో విడుదలై సూపర్ డూపర్ హిట్‌గా 'జయం మనదేరా' నిలిచింది. ఈ చిత్రం రెండు నంది అవార్డులతో పాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను పొందింది. వెంకటేష్ కెరీర్‌లో ఒక మైలురాయిగా ఈ మూవీ నిలవడమే కాకుండా.. ఆయన కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో వెంకటేష్.. మహదేవ నాయుడు, అభిరాం అనే రెండు పాత్రలు పోషించారు. అప్పట్లో ఇదో మాస్ సినిమాగా ప్రేక్షకులు ఆదరించారు.'జయం మనదేరా' మూవీ రూ. 16 కోట్ల మేరకు కలెక్షన్స్ రాబట్టి 2000 సంవత్సరంలో రెండోవ అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. నైజాం ప్రాంతంలో ఆల్-టైమ్ మొదటి వారం రికార్డును క్రియేట్ చేయడమే కాకుండా.. చిరంజీవి నటించిన అన్నయ్య కలెక్షన్స్‌ను కూడా అధిగమించింది. అదే సంవత్సరం సంక్రాంతికి విడుదలైన (కలిసుందం రా) 18 కోట్ల షేర్‌తో ఆల్-టైమ్ బిగ్గెస్ట్ గ్రాసర్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. జయం మనదేరా చిత్రం 149 కేంద్రాలలో 114 ప్రింట్లతో విడుదల కాగా... 120 కేంద్రాల్లో 50 రోజులు, 33 కేంద్రాల్లో 100 రోజుల పాటు ప్రదర్శించారు. అలా 2000 సంవత్సరం వెంకటేష్‌కు ఇది గోల్డెన్ ఇయర్ అని చెప్పవచ్చు.అయితే, ఈ సినిమాకు బ్రాండ్ ప్రమోషన్‌గా థమ్స్ అప్ కంపెనీ కొనసాగింది. సినిమా కోసం బ్రాండ్ ప్రమోషన్‌గా ఒక కంపెనీ నిలవడం అనేది ఇక్కడి నుంచే మొదలైంది. అందుకోసం ఆ కంపెనీ రూ.80 లక్షలు చెల్లించింది. ఆ డబ్బుతోనే ఈ సినిమా నిర్మించేందుకు కాస్త ఉపయోగపడిందని చెబుతారు. ఇది అప్పట్లో ఒక వ్యూహాత్మక నిర్ణయంగా నిలిచింది. ఈ మూవీ షూటింగ్ యూరప్‌లో 25 రోజులు కొనసాగింది. ఆపై రెండు పాటలను యునైటెడ్ స్టేట్స్‌లో చిత్రీకరించారు. ఇలా ఇతర దేశాల్లో షూటింగ్ జరగడం ఆరోజుల్లో కాస్త అరుదుగానే జరిగేది.

## ఏఐతో అసభ్యకర వీడియోలు..

### యూట్యూబ్‌కు ఐశ్వర్య దంపతుల షాక్!



ఇటీవల తమ అనుమతి లేకుండా ఫోటోలు వినియోగిస్తున్నారని బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండానే అనేక వెబ్‌సైట్‌లు తన పేరును ఉపయోగించి పలు వస్తువులను విక్రయిస్తున్నాయని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. వీరి పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం ?అనుకూలంగా తీర్పునిచ్చింది. వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించేలా ఉన్న అలాంటి వాటిని తొలగించేలా ఆదేశాలిస్తామని కోర్టు వెల్లడించింది.తాజాగా ఈ జంట మరోసారి కోర్టును ఆశ్రయించారు. తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం కలిగించేలా గూగుల్, యూట్యూబ్ తమ ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ రూ.4 కోట్ల దావా వేశారు. ఏఐ సాయంతో రూపొందించిన వీడియో కంటెంట్‌ను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని పిటిషన్‌లో ప్రస్తావించారు. లైంగికంగా అసభ్యకరమైన వీడియోలను రూపొందిస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని.. ఏఐ బాలీవుడ్ ఇష్క్ అనే ఛానెల్లో దాదాపు 259 వీడియోల కంటే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కాగా.. అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ 2008లో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరాధ్య అనే కూతురు ఉన్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే ఐశ్వర్య ప్రస్తుతం ఎలాంటి సినిమాలు ప్రకటించలేదు. ఆమె చివరిసారిగా మణిరత్నం తెరకెక్కించిన పొన్నియిన్ సెల్వన్-2 చిత్రంలో కనిపించింది.

## రూ.60 కోట్ల చీటింగ్ కేసు..

### శిల్పాశెట్టిని ప్రశ్నించిన పోలీసులు




ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి.

ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

## డ్రాగన్‌తో యువరాణి సాహసాలు

**సినిమా:'డామ్సెల్'**
**జానర్: ఫాంటసీ అడ్వెంచర్**
**ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్**



తండ్రి రాజ్య సమస్యలు తీర్చడం కోసం ఓ శాపగ్రస్త కుటుంబంలోని యువ రాజును పెళ్లి చేసుకోవడానికి సిద్ధ పడుతుంది ఓ యువరాణి. వివాహం తర్వాత ఆమె జీవితంలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి, వాటన్నింటిని తట్టుకుని ఆమె నిలబడిందా? అనే కథాంశంతో తెరకెక్కిందే 'డామ్సెల్' సినిమా. కథాంశం: ఎలోడి(మిల్లీ బాబీ బ్రౌన్) ఒక రాజ్యానికి యువరాణి. కానీ తన రాజ్యంలో కరవు పరిస్థితుల వల్ల ప్రజలంతా ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అదే సమయంలో ఎలోడికి ధనిక రాజ్యం నుంచి ఒక పెళ్లి సంబంధం వస్తుంది. ఆ దేశ రాజుని వివాహమాడితే తమ రాజ్యంలోని కష్టాలన్నీ తీరిపోతాయనే తండ్రి మాటలు నమ్మి ఎలోడి పెళ్లికి ఒప్పుకుంటుంది. దీని కోసం కుటుంబంతో సహా వరుడి రాజ్యానికి వెళ్తుంది. అక్కడి యువరాజుతో జరిగిన సంభాషణలతో ఆమెకు కూడా అతడిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. కానీ ఆమె తల్లికి మాత్రం ఆ కుటుంబ ప్రవర్తనపై మొదటి నుంచి సందేహంగానే ఉంటుంది. ఇలా అనుమానాలతోనే ఆ పెళ్లి జరిగిపోతుంది. ఇంతలోనే వరుడి కుటుంబం ఆచారం పేరుతో ఒక డ్రాగన్ ఉండే గుహలోకి తీసుకెళ్లి ఆమెను తెలీకుండానే బలి ఇవ్వాలని గుహ లోయలోకి విసిరేస్తారు. దాంతో పూర్తిగా లోయలో చిక్కుకుపోయినా ఎలోడి తనను డ్రాగన్‌కు అర్పించారని తెలుసుకున్నాక ఏం చేసింది? అక్కడి నుంచి తప్పించుకుందా? డ్రాగన్‌కి గతం గురించి చెప్పి దానిని తనవైపు ఎలా తిప్పుకుందో తెలియాలంటే 'డామ్సెల్' సినిమా చూడాల్సిందే.

అమెరికన్ డార్క్ ఫాంటసీ చిత్రంగా ఈ సినిమాకి జువాన్ కార్లోస్ ఫ్రెస్నాడిల్లో దర్శకత్వం వహించారు. యువరాణి పాత్రలో మిల్లీ బాబీ బ్రౌన్ తన నటనతో ఆకట్టుకుంటుంది. తనకి దొరికిన ప్రతి వస్తువుని ఆయుధాలుగా ఉపయోగించి గుహనుంచి తప్పించుకునేందుకు మిల్లీ చేసే సాహసాలు ప్రేక్షకులకి థ్రిల్‌ని పంచేలా ఉంటాయి. అనుకోకుండా ఒక్కసారిగా డ్రాగన్ వచ్చే సన్నివేశాలు కాస్త భయంగా అనిపించినా ఆకట్టుకునేలా ఉంటాయి. క్లిష్ట పరిస్థితులలో కూడా తెలివిగా వ్యవహరించి అడ్వెంచర్ చేసే మిల్లీ అనే మహిళ కథేంటో మీరూ తెలుసుకోండి.

## ది ఇండియా స్టోరీ పూర్తి



'ది ఇండియా స్టోరీ' సినిమాను పూర్తి చేశారు కాజల్ అగర్వాల్. శ్రేయాస్ తల్పాడే, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిందీ సినిమా 'ది ఇండియా స్టోరీ'. డీకే చేతన్ దర్శకత్వంలో ఎమ్ఐజీ ప్రొడక్షన్స్ అండ్ స్టూడియోస్ పతాకంపై సాగర్ బి. షిండే నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో లాయర్‌గా నటించారు కాజల్.రైతుల కష్టాలు, కార్పొరేట్ సంస్థలు తయారు చేసే పంటల పిచికారీ మందుల వ్యా పారాలు వంటి అంశాల నేపథ్యంతో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ సమాచారం. మురళీ శర్మ, మనీష్ వాధ్యా, త్రిషా సర్ధా కీలక పాత్రల్లో నటించిన 'ది ఇండియా స్టోరీ'ని ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నా కుదరలేదు. 2026లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు మేకర్స్.

## 'కాంతార చాప్టర్ 1'కు స్టార్ క్రికెటర్ ఫిదా..

### రిషబ్‌పై ప్రశంసలు





రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1'. దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు."కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారు" అని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది.

కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. "మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం" అని తెలిపారు.

# అవి నా చేతుల్లో ఉండవు: హృతిక్ రోషన్



"హీరో.. డైరెక్టర్.. నిర్మాత.. ఇలా ఓ సినిమాకి పనిచేసే నటీనటులు, సాంకేతిక నిపుణులు తమ సినిమా విజయం సాధించాలనే కోరుకుంటారు. అయితే అన్ని సినిమాలూ విజయం సాధిస్తాయని చెప్పలేం. వందశాతం ఎఫర్ట్ పెట్టి పనిచేయడమే నా చేతుల్లో ఉంటుంది. హిట్లు, ఫ్లాపులు అనేవి నా చేతుల్లో ఉండవు.. వాటిని నిర్ణయించేది ప్రేక్షకులే. ఓ సినిమా ఫలితం ఎలా ఉన్నా పాజిటివ్‌గానే తీసుకోవాలి" అని హీరో హృతిక్ రోషన్ తెలిపారు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్, కియారా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వార్ 2'.అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల అయింది. భారీ అంచనాల నడుమ రిలీజైన ఈ చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. ఈ విషయంపై హృతిక్ రోషన్ తాజాగా స్పందించారు.

"వార్ 2' కోసం అయాన్ ముఖర్జీ చాలా కష్టపడ్డారు. తన ఎనర్జీ చూసి నాకు కూడా ఎంతో ఉత్సాహంగా పని చేయాలనిపించేది. ఈప్రాజెక్ట్ గురించి నాకు పూర్తిగా తెలుసు కాబట్టి కబీర్ పాత్రను చాలా సరదాగా పూర్తి చేశాను. ఒక నటుడిగా మన బాధ్యతను 100 శాతం పూర్తి చే యాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రతి దాన్ని సీరియస్‌గా కాకుండా ఈజీగానే తీసుకోవాలి. అన్ని సినిమాలూ హిట్ అవుతాయనే నమ్మకంతోనే చేస్తాం. కానీ, ఫలితం మాత్రం ప్రేక్షకులే ఇస్తారు. వీటన్నిటినీ మనం పాజిటివ్‌గానే తీసుకోవాలి" అంటూ హృతిక్ రోషన్‌పోస్ట్ చేశారు.

## యశ్.. సైన్స్ ఫిక్షన్?




కథానాయకుడు యశ్ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలున్నాయి. వాటిలో 'రామాయణ' తొలి భాగం చిత్రీకరణ ఇప్పటికే పూర్తి కాగా.. 'టాక్సిక్' ముగింపు దశ చిత్రీకరణలో ఉంది. అయితే వీటి తర్వాత ఆయన చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా తేలలేదు. ప్రముఖ తమిళ దర్శకుడు 'సర్దార్' ఫేమ్ పీఎస్ మిత్రన్ ఓ కథ వినిపించినట్లు గతంలో వార్తలు వినిపించినా.. ఆ తర్వాత దాని విషయంలో ఏ పురోగతి కనిపించలేదు. అయితే ప్రస్తుతం ఈ సినిమా విషయమై మళ్లీ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. మిత్రన్ సిద్ధం చేసిన సైన్స్ ఫిక్షన్ కథపై యశ్ సానుకూలంగా స్పందించారని సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే ఈ ప్రాజెక్ట్ కార్యరూపంలోకి వచ్చే అవకాశముంది. మిత్రన్ ప్రస్తుతం కార్తితో 'సర్దార్ 2'ను తెరకెక్కిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సీక్వెల్ వచ్చే ఏడాది ఆరంభంలో తెరపైకి వచ్చే అవకాశముంది.



# ఇక మారవా పృథ్వీ.. ఇంకెన్ని తప్పులు చేస్తావ్?

"నువ్వు ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారీ యు ప్రూవ్డ్ మి రాంగ్"... ఇదీ తెలుగు సినిమాలోని ఓ డైలాగ్. ఇప్పుడు ఈ డైలాగ్ ఎందుకు అంటారా? భారత యువ క్రికెటర్ 'వివాదాస్పద' ప్రవర్తనకు సరిగ్గా అతికే మాటలు ఇవి. అతడి తీరును చూసి 'ఇంకెప్పుడు' మారతావు అంటూ బయట నుంచి విమర్శలు రావడం మొదలయ్యాయి. ఆ ప్లేయర్ ఇంకెవరో కాదు పృథ్వీషా.. క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు అతడొక హాట్ టాపిక్.

మొన్నటివరకూ సరైన ప్రదర్శన ఇవ్వకుండా విమర్శలకు గురైన పృథ్వీ.. ఆటపరంగా దారిలో పడ్డాడని సంబరపడేలోగా తన 'తీరు'తో ఇక్కట్లు కొనితెచ్చుకున్నాడు. ఒకప్పుడు కలసికట్టుగా ఆడిన మాజీ సహచరుడి పైనే 'బ్యాట్' ఎత్తేవరకూ వెళ్లాడు. కాలర్ పట్టుకొని వివాదాస్పదరీతిలో ప్రవర్తించాడు. ముంబయి – మహారాష్ట్రల మధ్య జరుగుతున్న మూడు రోజుల మ్యాచ్‌లో పృథ్వీషా బరిలోకి దిగాడు. మహారాష్ట్ర తరఫున ఆడిన అతడు భారీ శతకం (181) కూడా సాధించాడు. ఇంకాస్తలో డబుల్ సెంచరీ చేయడం ఖాయమని భావించాడు. అయితే, ముంబయి బ్యాటర్ ముషీర్ ఖాన్ వేసిన లెగ్ సైడ్ బంతిని భారీషాట్‌కు యత్నించిన పృథ్వీ లాంగ్‌లో దొరికిపోయాడు. బౌలర్ ముషీర్ ఖాన్ 'థాంక్యూ' అనే మాట అనడంతోనే వివాదం మొదలైందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. దానికి సీరియస్‌గా రియాక్ట్ అయిన పృథ్వీ తన బ్యాట్‌ను ముషీర్ వైపు తిప్పాడు. కొద్దిలో ముషీర్‌ను తాకేదే కానీ, అప్పటికే అతడు తప్పించుకున్నాడు. అయినాసరే వదలని పృథ్వీ మరింత దూకుడుగా ముషీర్ వైపు వెళ్లి కాలర్ పట్టుకోవడం, ఆ తర్వాత దుర్భాషలాడటం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనతో అతడు కష్టపడి చేసిన 181 పరుగుల ఇన్నింగ్స్ కనుమరుగైంది. ఇదే మొదటిది అనుకుంటే పొరపాటే. పృథ్వీ షా కెరీర్‌లో ఇలాంటివి చాలా వివాదాలూ ఉండటం గమనార్హం.

సప్నా గిల్ ఉదంతం..

రెండేళ్ల కిందట పృథ్వీ షా ఓ రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సప్నా గిల్‌తో వివాదమైంది. సెల్ఫీలు అడుగుతూనే ఉండటంతో ఆమె నుంచి తప్పించుకొనే క్రమంలో కాస్త హార్ష్‌గా ప్రవర్తించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. దీంతో ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసే వరకూ వెళ్లింది. ఆ తర్వాత సోషల్ మీడియాలోనూ ఇరువురి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి.

డోపింగ్‌లో విఫలమై.. సస్పెన్షన్

2019లో పృథ్వీషాపై బీసీసీఐ ఎనిమిది నెలల నిషేధం విధించింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా డోపింగ్ టెస్టులో విఫలమయ్యాడు. నిషేధించిన మందులను వాడినట్లు అప్పట్లో తేలింది. దీంతో అతడిపై బీసీసీఐ బ్యాన్ విధించింది. గతేడాది పృథ్వీ షా ఫిట్‌నెస్ లెవల్స్ మరీ పడిపోయాయి. అతడి బాడీలో ఫ్యాట్ పర్సంటేజీ 35 శాతానికి చేరినట్లు నివేదికలు వచ్చాయి. దీంతో రంజీ, విజయ్ హజారే ట్రోఫీ స్క్వాడ్ నుంచి ముంబయి అతడిని తప్పించింది.

ఐపీఎల్‌లోనూ అతడి తీరు వివాదాస్పదమే. దిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వీషా తమ జట్టు ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ పైనా విమర్శలు గుప్పించాడు. ప్రాక్టీస్ చేయమని చెబితే.. 'ఇవాళ నేను మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయను' అని పృథ్వీ షా అన్నట్లుగా రికీ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఆ తర్వాత అక్కడా అవకాశాలు తగ్గిపోయాయి. గత సీజన్‌లో ఎవరూ అతడిని కొనుగోలు కూడా చేయలేదు.

ఇలాగే ఉంటే..

ఓవైపు భారత జట్టులోకి రావాలంటే పోటీ చాలా తీవ్రంగా ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్ల విషయంలో చాలా కఠినంగా ఉంటాడని తెలుసు కదా.. ఇలాంటప్పుడు కూడా 'వివాదాస్పద' ప్రవర్తనతో ఉంటే జాతీయజట్టులోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాలు మూసుకుపోతాయనేది క్రీడా పండితుల విశ్లేషణ. ఓవైపు ఆట పరంగా మరింత ఉన్నతంగా మారాల్సింది పోయి.. రోజుకో వివాదంతో వార్తల్లోకి వస్తే క్రికెట్ కెరీర్‌పై తీవ్ర ప్రభావం పడటం ఖాయం.

భారీ సెంచరీ చేసిన ఆనందం లేకుండా చేసుకున్నాడు. ఇదే కొనసాగితే ముమ్ముందు దేశవాళీలోనూ ఛాన్స్‌లు రావడం కష్టమే. ఇప్పుడు భారత క్రికెట్‌లో ఇలా 'వివాదాలు' తలకెత్తుకున్న క్రికెటర్లు లేరేమో!

## ఆస్ట్రేలియా క్రికెట్‌ను వదిలేస్తే
# చెరో రూ.58 కోట్లు.. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆఫర్



సోషల్ మీడియాతోపాటు క్రికెట్ వర్గాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఆస్ట్రేలియా కెప్టెన్‌తోపాటు ఆ జట్టు డేంజరస్ బ్యాటర్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ మొత్తం ఆఫర్ చేసిందని.. అందుకోసం ఓ షరతు విధించినట్లు కథనాలు వస్తున్నాయి. ఇంతకీ ఆ ఆటగాళ్లు ఎవరు? ఆఫర్ ఏంటో ఓ లుక్కేద్దాం...ఆస్ట్రేలియా టెస్టు జట్టు సారథి పాట్ కమిన్స్, ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ఐపీఎల్‌కు చెందిన ఓ ఫ్రాంచైజీ రూ. 58 కోట్లు (10 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్లు) చొప్పున ఇచ్చేందుకు ఆఫర్ చేసింది. అయితే, ఆ మొత్తం అందుకోవాలంటే ముందు ఆస్ట్రేలియా క్రికెట్ నుంచి బయటకు రావాల్సి ఉంటుంది. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కాకుండా.. తమ ఫ్రాంచైజీకి చెందిన జట్ల తరఫున ఇతర టీ20 లీగుల్లోనూ ఆడాల్సిఉంది. జాతీయ జట్టు తరఫున ఆడకుండా.. ఫ్రాంచైజీకి వస్తున్నందుకే ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏడాది పొడవునా లీగులు ఉండటంతో ఫ్రాంచైజీకీ ఆ ధర బాగానే వర్కౌట్ అవుతుందనేది క్రికెట్ వర్గాల అంచనా. అయితే, వారిద్దరూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా, రాష్ట్రాల క్రికెట్ సంఘాలు, ప్లేయర్ల యూనియన్‌లోనూ చర్చించాల్సి ఉంది.

ఇప్పటివరకు ఎంత వస్తుందంటే?

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న పాట్ కమిన్స్ ను ఏడాదికి రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. ప్రస్తుతం అతడే ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ అనే సంగతి తెలిసిందే. ఇక క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఏడాదికి కాంట్రాక్ట్ రూపంలో రూ. 8.74 కోట్లు వస్తాయి. ప్రస్తుతం అతడు టెస్టు, వన్డేలకు సారథిగా ఉన్నాడు. తమ జాతీయ బోర్డు నుంచి అన్నీ కలుపుకొని రూ. 17.50 కోట్ల వరకూ వస్తాయి. ఇతర ఫ్రాంచైజీల్లోనూ ఆడినప్పటికీ ఇంత మొత్తం రాదు. ఐపీఎల్‌తో వచ్చే ఆదాయం కలిపి సుమారు రూ. 35 నుంచి 40 కోట్ల వరకూ అందుతాయి. ట్రావిస్ హెడ్ ( ) విషయంలో ఈ మొత్తం కాస్త తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి రూ. 8.70 కోట్లు వస్తాయి. ఇతర లీగుల్లోనూ ఆడినప్పటికీ ఈ మాత్రం మొత్తం రాదు. ఏడాదికి ట్రావిస్ హెడ్ సుమారుగా రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకూ తీసుకుంటాడు. ఇప్పుడు ఆ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఇస్తామన్న రూ.58 కోట్ల ఆఫర్ కమిన్స్‌తో పోలిస్తే హెడ్‌కే ఎక్కువ బెనిఫిట్ అవుతుంది.



# టెస్టు ర్యాంకింగ్స్..
# సిరాజ్, జడేజాకు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు

: భారత క్రికెటర్లు మహ్మద్ సిరాజ్ రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు అందుకున్నారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గణనీయంగా స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. ఈ హైదరబాదీ పేసర్‌కు టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు ఇవే. జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు.సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ( (644 పాయింట్లు) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి ఎగబాకాడు. విండీస్‌పై జడేజా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (104లి) చేసిన సంగతి తెలిసిందే. ఇదే మ్యాచ్‌లో శతకం (100) బాదిన కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు జంప్ అయి 35 స్థానానికి చేరుకున్నాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.

# రెండేళ్లు ఏంటి.. మరో నాలుగేళ్లు ఆడేంత 'నాజూగ్గా'

కొన్ని రోజుల కిందట వరకూ రోహిత్ శర్మను చూసినవారు 'వచ్చే వన్డే ప్రపంచ కప్' వరకూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కష్టం అనుకొనేవారు. తాజాగా అతడి పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయాయి. దానికి కారణం 'స్లిమ్'గా మారి యువ క్రికెటర్లకే పోటీనిచ్చేలా ఉండటం. ఇప్పుడు అతడిని చూస్తే 38 ఏళ్ల క్రికెటర్‌లా అస్సలు కనిపించడు. ఇవేవో '%ూ×%' జనరేటెడ్ ఫొటోలు అనడానికీ వీల్లేదు. ఎందుకంటే కెప్టెన్సీ పోయాక తొలిసారి రోహిత్ ఓ కార్యక్రమంలో పాల్గొనడం.. ఛాంపియన్స్ ట్రోఫీపై మాట్లాడటం తెలిసిందే.

అవన్నీ తప్పని రుజువు చేస్తూ..

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించే క్రమంలో రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ సారథిగా నియమించింది. రోహిత్‌కు టీమ్‌లో ప్లేస్ అయితే ఉంది కానీ కెప్టెన్సీ మాత్రం లేదు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతంగా విమర్శలు వచ్చాయి. విలేకర్ల సమావేశంలోనూ అజిత్ అగార్కర్ స్పందిస్తూ 'భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం' అని చెప్పాడు. అంటే వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీ నాటికి రోహిత్‌కు 40 ఏళ్లు వస్తాయి. అలాంటప్పుడు అతడికే సారథ్యం కొనసాగిస్తే 'ఫిట్‌నెస్' సమస్య ఎదురైనప్పుడు అప్పటికప్పుడు కొత్త కెప్టెన్‌ను తయారుచేయడం కష్టమనే వాదనా బీసీసీఐ నుంచి వచ్చింది. ఇప్పుడు రోహిత్‌ను చూసిన ప్రతిఒక్కరూ కూడా 'రెండేళ్లు ఏంటి నాలుగేళ్లైనా సరే ఆడేలా ఉన్నాడు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. సియట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

బరువు తగ్గి..

కేవలం వన్డేల్లో కొనసాగుతూ 2027 ప్రపంచ కప్ నెగ్గడమే లక్ష్యంగా ఉన్న రోహిత్ శర్మకు ఫిట్‌నెస్ సాధించడమే పెద్ద సవాల్. మరో సీనియర్ విరాట్ కోహ్లికి ఈ విషయంలో సమస్యే లేదు. అతడు ఎప్పుడూ వర్కౌట్లు చేస్తూ బిజీగానే ఉంటాడు. రోహిత్ చూసేందుకు కాస్త లావుగా ఉన్నప్పటికీ ఆ ప్రభావం మైదానంలో కనిపించదు. ఫీల్డింగ్‌లోనూ మెరుపులు మెరిపిస్తుంటాడు. బ్యాటింగ్‌లోనూ అతడి 'హిట్టింగ్' ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యర్థులకు ఎరుకే. భారత మాజీ కోచ్ అభిషేక్ నాయర్ నేతృత్వంలో దాదాపు 10 కేజీలు తగ్గిన రోహిత్.. ఇప్పుడు మరింత నాజూగ్గా మారిపోయాడు. ఇప్పటికే బీసీసీఐ ఫిట్‌నెస్ టెస్టులను పాసైన సంగతి తెలిసిందే. అందుకే, ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసినట్లు అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలూ రోహిత్ కష్టానికి ప్రతిఫలం.

ఆ రికార్డులపై కన్నేసిన రోహిత్..

వన్డే ప్రపంచకప్ 2027 వరకూ తాను అందుబాటులో ఉంటానని చెప్పాలంటే.. ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను రోహిత్ సద్వినియోగం చేసుకోవాలి. మెగా టోర్నీ నాటికి మహాఅయితే ఓ పాతిక వన్డేలను మాత్రమే ఆడే అవకాశం ఉంది. సునీల్ గావస్కర్ 'మ్యాచ్ ప్రాక్టీస్ కావాలంటే రంజీల్లోనూ ఆడాలి' చెప్పిన మాటలను కూడా ఆచరిస్తే రోహిత్‌కు అవకాశం ఇవ్వకుండా బీసీసీఐ తప్పించుకోలేదు. ఆస్ట్రేలియాపై ఆడేందుకు రోహిత్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. అక్టోబర్ 19 నుంచి వన్డే సిరీస్ మొదలుకానుంది. ఈక్రమంలో అతడి ముందు ఆరు రికార్డులు ఉన్నాయి. ఓ అరుదైన ఘనత సాధించే అవకాశమూ ఉంది.

ఇప్పటివరకు భారత్ తరఫున కేవలం నలుగురు మాత్రమే 500 కంటే ఎక్కువ అంతర్జాతీయ మ్యాచులు ఆడిన ప్లేయర్లు ఉన్నారు. సచిన్ (664), విరాట్ (550), ధోనీ (535), రాహుల్ ద్రవిడ్ (504). ఇప్పుడీ జాబితాలోకి రోహిత్ (499) వచ్చే అవకాశం ఉంది.



మరో ఎనిమిది సిక్స్‌లు కొడితే వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన క్రికెటర్‌గా రోహిత్ అవతరిస్తాడు. ప్రస్తుతం రోహిత్ 344 సిక్స్‌లతో ఉండగా.. షాహిద్ అఫ్రిది (351) అందరికంటే ముందున్నాడు. మరో 12 సిక్స్‌లు కొడితే ఆసీస్‌పై అత్యధిక సిక్స్‌లు బాదిన క్రికెటర్ అవుతాడు. ఆసీస్‌పై మరో 10 పరుగులు చేస్తే వెయ్యి రన్స్ చేసిన భారత బ్యాటర్‌గానూ రోహిత్ మారతాడు. ఇప్పటివరకు 19 మ్యాచుల్లో 990 పరుగులు రాబట్టాడు. ఈ సిరీస్‌లో రెండు సెంచరీలు చేస్తే.. ఆసీస్‌పై అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్‌గా రోహిత్ నిలుస్తాడు. ప్రస్తుతం సచిన్ (9) తర్వాత రోహిత్ (8) ఉన్నాడు. విరాట్ కోహ్లీ (8) కూడా ఈ రేసులో ఉండటం గమనార్హం. రోహిత్ కనీసం ఒక్క సెంచరీ చేసినా ఆసీస్‌పై అత్యధికంగా మూడంకెల స్కోరు చేసిన బ్యాటర్‌గానూ నిలుస్తాడు.

వన్డేల్లో మరో 54 పరుగులు చేస్తే భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా రోహిత్ అవతరిస్తాడు. 273 మ్యాచుల్లో 11,168 పరుగులు చేసిన రోహిత్.. నాలుగో స్థానంలో ఉన్నాడు. సచిన్(18,426), విరాట్ (14,181), సౌరభ్ గంగూలీ (11,221) మాత్రమే ముందున్నారు. ఆసీస్‌తో మూడు వన్డేల్లోనూ సెంచరీలు చేస్తే అంతర్జాతీయంగా అన్ని ఫార్మాట్లలో కలిపి 20వేల పరుగుల మైలురాయిని అందుకొంటాడు. ప్రస్తుతం 499 మ్యాచుల్లో 19,700 పరుగులు చేశాడు.



## ట్రోఫీ లేకుండానే సంబరాలు..
# అదంతా అర్ష్‌దీప్ ఐడియా: వరుణ్ చక్రవర్తి

ఆసియా కప్ ఫైనల్ అనంతరం జరిగిన పరిణామాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. తుది పోరులో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించినా సరే కప్ ఇవ్వకుండా ఏసీసీ చీఫ్ నఖ్వీ తన గదికి తీసుకెళ్లారు. అతడి చేతులమీదుగా తీసుకొనేందుకు నిరాకరించడంతో ఇలా చేశారు. దీనిపై నఖ్వీపై తీవ్రస్థాయిలో విమర్శలూ వచ్చాయి. ఆ తర్వాత కూడా బీసీసీఐకి ట్రోఫీ, మెడల్స్ ఇవ్వడానికి నిరాకరించిన నఖ్వీ.. భారత సారథే స్వయంగా తన కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని మొండిపట్టు పట్టారు. మరోవైపు భారత్ మాత్రం వాటికేమీ తలొగ్గకుండా ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. ఫైనల్ రోజున కూడా భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకోవడం జవశ్రీవఎతీఫ్‌అశీఅం%) వైరల్‌గా మారిపోయింది. గత టీ20 ప్రపంచకప్ అనంతరం రోహిత్ శర్మ 'రోబో'లా వచ్చినట్లే.. ఇప్పుడు సూర్యకుమార్ కూడా అదే స్టైల్‌లో 'ట్రోఫీ'ని అందించినట్లు చేశాడు. అయితే, దీనివెనక అర్ష్‌దీప్‌సింగ్ ఉన్నాడని తాజాగా వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు.

"ట్రోఫీ వస్తుందేమోనని మేం చాలాసేపు వేచి చూశాం. కానీ, అలా జరగలేదు. అప్పుడు అర్ష్‌దీప్‌సింగ్ ఓ ఐడియా ఇచ్చాడు. కప్ అందుకొన్నట్లు చేద్దాం. తర్వాత ఫొటోస్‌లు మార్చుకోవచ్చని చెప్పాడు. దీంతో మేమంతా అలానే చేశాం. నేను కూడా అలా చేశా.

నేను బెడ్‌పై పడుకున్న ఫొటోలు సోషల్ మీడియా (%ూశీఆఖుశ్రీ వీఎంఖు%)లో వైరల్‌గా మారాయి. నా పక్కన ట్రోఫీ ఉంటుందనుకుంటే కాఫీ కప్ ఉంచారు (నవ్వుతూ)" అని వరుణ్ వ్యాఖ్యానించాడు. "ట్రోఫీ లేకుండా సంబరాలు చేసుకోవడం చాలా కొత్తగా ఉంది. మా డ్రెస్సింగ్ రూమ్‌లో అద్భుతమైన వాతావరణం ఉంది. కప్ ఉన్నట్లే సంబరాలు చేసుకున్నాం" అని సంజు శాంసన్ వెల్లడించాడు.

# అసెంబ్లీ ఉప ఎన్నికలలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి

* **ఎంసీఎంసీ, మీడియా కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్**

హైదరాబాద్, అక్టోబర్ 08 (భారత శక్తి): జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలనీ జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్వో విభాగంలో ఎంసీఎంసీ, మీడియా కేంద్రంను జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రారంభించారు.ఎలక్ట్రానిక్ మీడియా,లోకల్ కేబుల్, సోషల్ మీడియా,ఈ - పేపర్, రేడియో, ఇతర ఆన్‌లైన్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ప్రకటనలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల నుండే ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతి తీసుకోవాలనీ



జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు.ప్రింట్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు ప్రచార ప్రకటనల కోసం ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి అన్నారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ప్రకటనల కోసం ఎంసీఎంసీకీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ ప్రింట్ చేసిన కరపత్రాలపై పబ్లిషర్ పేరు, అడ్రస్, హ్యాండ్ బిల్ ఇతర పత్రాలు ముద్రించిన సందర్భంలో తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. మీడియా కేంద్రం ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం మీడియా ప్రతినిధులకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పిఆర్ఓ విభాగం అధికారులకు సూచించారు.

* **జిల్లా ఎన్నికల అధికారి చైర్మన్ గా ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు**

జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ఈ కమిటీకి చైర్మన్ గా , జిహెచ్ఎంసి ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం మెంబర్ సెక్రటరీగా వ్యవహరించనున్నారు. సికింద్రాబాద్ ఆర్డిఓ,జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.సాయిరామ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ (ఐటి వింగ్ - సోషల్ మీడియా) నర్సింగ్‌రావు,హైదరాబాద్ పిఐబి డిప్యూటీ డైరెక్టర్ మనసా కృష్ణ కాంత్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డైలీ ప్రిన్సిపల్ కరస్పాండెంట్ బచంజీత్ సింగ్ లు కమిటీలో సభ్యులు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎంసీఎంసీ కమిటీ, ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలపై పర్యవేక్షణ చేయనుంది.ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ ఎస్పీ, ఎంసీసి నోడల్ అధికారి నరసింహ రెడ్డి,పిఆర్ఓ మామిండ్ల దశరథం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



**ఎల్బీనగర్, అక్టోబర్ 08 (భారత శక్తి):**
**దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా దేవాలయ ట్రస్టీ శశికళ,ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో లింగాల రాహుల్ గౌడ్, మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.**

## ప్రజావాణి ఫిర్యాదులపై...
# హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటన

* **తూముకుంట మున్సిపాలిటీలో పరిశీలన**
* **నాళాల ఆక్రమణలు తొలగించాలని ఆదేశం**

హైదరాబాద్, అక్టోబర్ 08 (భారతశక్తి) : ప్రజావాణి ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ , బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తూముకుంట మున్సిపాలిటీలో పర్యటించారు. దేవరాయాంజాల్ విలేజ్ లో సర్వే నంబర్ 135, 136లలో రహదారిలో ఆటంకాలు కలిగిస్తున్న వివాదంపై హై కోర్టు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అదే మార్గంలో కొత్తగా కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వస్తున్న క్రమంలో రహదారిని వెంటనే పునరుద్ధరించాలని స్థానిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం దేవరాయాంజాల్ విలేజ్లోని వరద కాలువ ఆక్రమణలను పరిశీలించారు.

* **వరద కాలువ వాస్త వెడల్పు ఉండేలా...**

తుర్కవాణి కుంట నుంచి దేవరాయాంజాల్ చెరువుకు వెళ్లే వరద కాలువ కబ్జా కావడంతో 4 కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసారు. గ్రామ రికార్డ్స్, సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సి మ్యాపుల ఆధారంగా గతంలో ఎంత విస్తీర్ణంలో ఉండేదో



చూసి. ఆక్రమణలు తొలగించి వరద కాలువను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. తర్వాత తూముకుంట విలేజ్లోని వాసవి సుచిర్ ఇండియా లేపుట్లో నాలా కుంచించుకుపోవడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. దేవరాయాంజాల్ చెరువు, పోతాయిపల్లి చెరువు నుంచి గుండ్లకుంట చెరువుకు వెళ్లే వరద కాలువ వాస్తవ వెడల్పు కొనసాగించకుండా నిర్మించడాన్ని పరిశీలించారు. 9 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 2 మీటర్లకే పరిమితం చేయడం వల్ల అదే వెంచర్లోని ప్లాట్లతో పాటు పై భాగంలో ఉన్న నివాసాలు కూడా మునిగిపోతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన వీడియోలు చూపించారు. ఓపెన్ నాల ఉండాల్సిన చోట పైపులు వేయడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు చెప్పారు. ఇరిగేషన్, hmda, మునిసిపాలిటీ అధికారులతో పాటు వెంచర్ యజమానులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో స్థానికులు ఊరట చెందారు. హైడ్రా అదనపు కమిషనర్ ఎన్. అశోక్ కుమార్ గారు, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య .గారితో పాటు హైడ్రా అధికార కమిషనర్ రంగనాథ్ వెంట ఈ పర్యటనలో ఉన్నారు.




## ఎల్బీనగర్ డీసీపీని కలిసిన సురక్ష సేవా సంఘం
## తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్

ఎల్బీనగర్, అక్టోబర్ 08 (భారత శక్తి): రాచకొండ పోలీస్ కమిషనరేట్ లోని ఎల్బీనగర్ డివిజన్ నూతన డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి డా" బి అనురాధ ఐపీఎస్ ను సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలుపై డీసీపీ మాట్లాడుతూ, ముఖ్యంగా జరుగుతున్న ఆత్మహత్యల నివారణ, మత్తు పదార్థాలకు యువత బానిసవ్వడం వంటి వాటిపై అవగాహన కల్పించాలని సమాజ పరిరక్షణలో స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు.




# 24 గంటలు..20 ఆపరేషన్లు వేములవాడ ఏరియా ఆసుపత్రి మరో రికార్డ్

* **మెరుగైన సేవలందిస్తూ దవాఖాన సత్తాచాటుతున్న వైద్యులు.**
* **వైద్యులు, సిబ్బందిని అభినందించిన ప్రభుత్వ విప్ ఆది.**

వేములవాడ, అక్టోబర్ 08 (భారత శక్తి) : వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయి.24 గంటల్లో 20 శాస్త్ర చికిత్సలను చేసి మరోసారి దవాఖాన సత్తాచాటుతూ కార్పొరేట్ కు దీటుగా ముందుకు సాగుతున్నారు. ఇందులో సాధారణ కాన్పులు 04, ఆపరేషన్లు ద్వారా 09,కంటి ఆపరేషన్ 04, జనరల్ సర్జరీలు 02, ఆర్థో ఆపరేషన్ 01 ఉన్నాయి . ఆపరేషన్లు చేసిన గైకాలజిస్ట్ డాక్టర్లు సంధ్య, సోని, మాధవి, పిల్లల వైద్యులు సుభాషిని చారి, రమణ, ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్, మత్తు వైద్యులు రాజశ్రీ, తిరుపతి, రవీందర్, కంటి వైద్యులు డాక్టర్ రత్నమాల,నర్సింగ్ ఆఫీసర్స్ ఝాన్సీ, జ్యోతి, అనసూయ, బ్లోసం తోపాటు ఇందులో పాల్గొన్న ఇతర సిబ్బందిని,ఆసుపత్రి సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్య అభినందించి, రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో వంద పడకల ఆసుపత్రిలో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. అనంతరం శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్యతో పాటు ఆసుపత్రి వైద్య బృందాన్ని, సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ దిశగా ప్రభుత్వ ఆసుపత్రులు ఆధునిక పరికరాలు, సిబ్బంది, వసతులతో బలోపేతం అవుతున్నాయని తెలిపారు. వేములవాడ ఆసుపత్రి వైద్యులు చూపిన నిబద్ధత ప్రశంసనీయమని తెలిపారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సమయానికి చికిత్స పొందేలా వైద్యులు మరింత కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది సూచించారు. అలాగే ఆధునిక వైద్య సేవలతో పాటు శుభ్రత, రోగి సేవ ధోరణిలో కూడా ఈ ఆసుపత్రి ఆదర్శంగా నిలవలన్నారు.వైద్య విభాగం పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆపరేషన్లు విజయవంతంగా పూర్తికావడం పట్ల వైద్యులను సహాయక సిబ్బందిని ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.



**ఎల్బీనగర్, అక్టోబర్ 08 (భారత శక్తి):**
**హైదరాబాద్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కాంచిరాజు కాశీనాథ్ బుధవారం జస్టిస్ అభినంద్ కుమార్ షావిలిని పదవీరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. తన పదవీకాలంలో జస్టిస్ షావిలి సుమారుగా 30 వేలకు పైగా కేసులను పరిష్కరించారు.**



## సి బి సి గౌరీ లైబ్రరీలో "స్వచ్ఛతా హి సేవ" నిర్వహణ

విశాఖపట్నం, అక్టోబర్ 08,(భారత శక్తి): విశాఖ పట్నంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ఫీల్డ్ ఆఫీస్, ఈరోజు అనకాపల్లిలోని గౌరీ గ్రంథాలయంలో "స్వచ్ఛతా హీ సేవ2025" ప్రచారంపై ప్రభావవంతమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. "స్వచ్ఛోత్సవ్" అనే ఇతివృత్తంతో ముడిపడి ఉన్న ఈ కార్యక్రమం, జీరో వేస్ట్ అలవాట్లు మరియు కమ్యూనిటీ పారిశుధ్యాన్ని నొక్కి చెప్పడం ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లింది. గౌరీ గ్రంథాలయం వినియోగదారులు మరియు పోషకులను ఉద్దేశించి సిబిసి డైరెక్టర్ పి. రత్నాకర్ మాట్లాడుతూ, "స్వచ్ఛతా హీ సేవ అనేది ఒక ప్రచారం కంటే ఎక్కువ, ఇది పరిశుభ్రమైన, పచ్చని భారతదేశం కోసం మన భవిష్యత్ తరాలకు ఒక ప్రతిజ్ఞ. అనకాపల్లిలో జరిగే ఇలాంటి కార్యక్రమాలు ప్రతి చిన్న చర్య కూడా స్వచ్ఛ భారత్ యొక్క పెద్ద దృక్పథం వైపు లెక్కించబడుతుందని మనకు గుర్తు చేస్తాయి" అని నొక్కి చెప్పారు. సానుకూల వాతావరణాన్ని సృష్టించడానికి ప్రాంగణాన్ని శుభ్రంగా మరియు చక్కగా ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పుస్తక పఠనం వలె, పరిశుభ్రత మరియు పరిశుభ్రమైన పద్ధతులు కూడా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని ఆయన అన్నారు. గౌరీ గ్రంథాలయం ద్వారా పౌరులకు, ముఖ్యంగా ఆశావహులైన విద్యార్థులకు అందించే సేవలను కార్యదర్శి కె.వెంకట రమణ వివరించారు. అధ్యక్షుడు బి. రామనాజీ, స్థానిక ఉపాధ్యాయుడు ఎ. వెంకట రామచంద్రరావు మరియు గ్రంథాలయ సిబ్బంది మరియు విద్యార్థులు అవగాహన ప్రచారంలో పాల్గొన్నారు. చారిత్రాత్మక నగర గ్రంథాలయ పోషకులు మరియు విద్యార్థులకు సిబిసి ఎఫ్ పి ఒ శ్రీరామమూర్తి కందాల స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిజ్ఞ తర్వాత, CBC అధికారులు మరియు స్వచ్ఛంద సేవకులు లైబ్రరీ ప్రాంగణంలో చెత్త తొలగింపు, వ్యర్థాల విభజన మరియు స్థల సుందరీకరణపై దృష్టి సారించి, ఆచరణాత్మక శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# మరింత విజయవంతం చేద్దాం... ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఏర్పాట్లపై సీఎం సమీక్ష

అమరావతి, అక్టోబర్ 08 (భారత శక్తి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నెల 16న ప్రధాని మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో, ఆయన పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనను గతంలో అమరావతి, విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమాలను మించి విజయవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలాన్ని సందర్శించి, భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకోనున్నారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ సంస్కరణలను స్వాగతిస్తూ దేశంలోనే తొలిసారిగా ఏపీ అసెంబ్లీలో అభినందన తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దసరా నుంచి దీపావళి వరకు జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రధాని సభను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సభా ప్రాంగణానికి వెళ్లే అప్రోచ్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి, దేశాన్ని బలోపేతం చేయండి

ముంబై, అక్టోబర్ 08 (భారత శక్తి) : దేశ ప్రజలు 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం (NMIA) మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకం వల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. "ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలి. ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలి. ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుంది. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయి" అని ప్రధాని మోదీ వివరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశ భద్రతే అత్యంత ప్రాధాన్యమని, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు. అంతేకాకుండా, మహారాష్ట్రలోని గత మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని మోదీ విమర్శించారు. నవీ ముంబై విమానాశ్రయం, ఇతర కనెక్టివిటీ ప్రాజెక్టులతో ముంబై నగరం ప్రపంచస్థాయి వృద్ధి కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌పోర్ట్ 'వికసిత భారత్' సంకల్పానికి ప్రతీక. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను యూరప్, గల్ఫ్ దేశాలకు సులభంగా ఎగుమతి చేయవచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ముంబై మెట్రో లైన్ 3 చివరి దశను కూడా ప్రారంభించారు. దీంతోపాటు 'ముంబై వన్ యాప్', యువతకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించే 'ముఖ్యమంత్రి షార్ట్‌టర్మ్ ఎంప్లాయబిలిటీ ప్రోగ్రామ్ (STEP)'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల కోసం విశేష కృషి చేసిన లోక్‌నేత డీబీ పాటిల్ సేవలను ఆయన స్మరించుకున్నారు.



## కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి
### : అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

* **రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకు రావాలి.**
* **పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి.**
* **పత్తి అమ్ముకొనుటకు రైతు స్లాట్ బుకింగ్ తప్పకుండా చేసుకోవాలి.**

భూపాలపల్లి, అక్టోబర్ 8 (భారత శక్తి): పత్తి పంటను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా మార్కెటింగ్, పోలీస్, వ్యవసాయ, విద్యుత్, రవాణా, తూనికలు కొలతలు అధికారులతో పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025-26లో జిల్లాలో 98,260 ఎకరాలలో పత్తి సాగు జరిగిందని, 11,79,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అక్టోబర్ మాసం తర్వాత పత్తి దిగుబడి ప్రారంభమవుతుందని, నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా పంట రాక ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్‌లో రేటు పలికితే వెంటనే సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు భూపాలపల్లి, కాటారం మరియు చిట్యాల మార్కెట్ పరిధిలో మొత్తం 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి తేమ శాతం 8% ఉన్నప్పుడు కనీస మద్దతు ధర రూ. **8,110/**గా ఉన్నదని చెప్పారు. రైతులు తమ పత్తిని మధ్యవర్తులు లేదా దళారులకు అమ్మకుండా, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికినప్పుడు సీసీఐ కేంద్రాలలో అమ్మాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో నీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలని, దానిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతులకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. రైతులు పత్తి పంటను జిన్నింగ్ మిల్లు లేదా పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లే ముందు 'కప్పాస్ కిసాన్ యాప్' ద్వారా తప్పనిసరిగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు." స్లాట్ బుకింగ్ చేయని రైతుల పత్తిని కొనుగోలు కేంద్రంలో స్వీకరించరని స్పష్టం చేశారు. ఈ చర్య రైతుల రాకపోకలు సౌకర్యవంతంగా ఉండటానికి, జిన్నింగ్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రతిరోజు పరిమిత సంఖ్యలో పత్తి లాట్లు స్వీకరించేందుకు ఉద్దేశించిందని తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువకు పత్తి అమ్మవద్దని, ప్రైవేట్ వ్యాపారులు లేదా మధ్యవర్తుల వాగ్దానాలకు లోనుకాకూడదని స్పష్టంచేశారు. పత్తి పంట తేమ శాతం పై కరపత్రాలు, అవగాహన ప్రచారం విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అగ్నిప్రమాద నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు 'కప్పాస్ కిసాన్ యాప్' ద్వారా రిజిస్టర్ అయి, స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పి నరేష్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చుర్, జిల్లా అగ్నిమాపక అధికారి వి సతీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా తూనికలు కొలతల అధికారి శ్రీలత, రవాణా శాఖ అధికారి సంధాని, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు, మార్కెట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే
## ప్రభుత్వానికి చెక్ పడుతుంది: కేటీఆర్, హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 08 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందినప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయగలమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎవరికి అప్పగించిన పనులకు వారు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలని తెలిపారు. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు చేపట్టాలని అన్నారు. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని ఆకాంక్షించారు. ప్రచారం చివరి దశలో రోడ్డు షోలు నిర్వహించాలని నిర్ణయించారు.


## బీసీ రిజర్వేషన్ల అంశంపై వాడివేడిగా వాదనలు..
## విచారణ రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 08 (భారత శక్తి) : తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను రేపు మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. స్థానిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తే స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. పిటిషనర్ విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ జీవోను పలువురు హైకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఆర్. కృష్ణయ్య, వి. హనుమంతరావుతో పాటు పలువురు బీసీ నాయకులు ఇంప్లీడ్ అయ్యారు. అన్ని పిటిషన్లను కలిపి సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 50 శాతం దాటినా రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదని అన్నారు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ సీలింగ్ వర్తించదని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు శాస్త్రీయ ఆధారాలు చూపలేదని, బీసీ కులగణన చేశారు కానీ బహిర్గతం చేయలేదని కోర్టుకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ జనాభాను పరిగణనలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధ ఎన్నికల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, రాజ్యాంగ విరుద్ధంగా నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని కోర్టుకు తెలిపారు. రాజకీయాలకతీతంగా మద్దతు లభించిన తర్వాత జీవోపై స్టే ఇవ్వాలని కోరడం సరికాదని అన్నారు. సమగ్ర కులగణన ద్వారానే ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని, కానీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచవచ్చని తెలిపారు. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని సింఘ్వీ అన్నారు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసన వ్యవస్థదే నిర్ణయమని అన్నారు. చట్టసభలు చేసిన చట్టాలను కొంతమంది గవర్నర్లు త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నారని కోర్టుకు తెలిపారు. కానీ నెలల పాటు ఏ నిర్ణయమూ చెప్పడం లేదని, బిల్లును ఆమోదించడం లేదు లేదా తిరస్కరించడం లేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ గవర్నర్ ఇలాగే వ్యవహరించారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వారి చర్యల వల్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని అన్నారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ఈ ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులు ఉన్నాయని అన్నారు. ఈ సమయంలో స్టే ఇవ్వడం సరికాదని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సమగ్ర అధ్యయనం తర్వాతే ఈ బిల్లును ప్రభుత్వం తీసుకువచ్చిందని, పూర్తి వాదనలు విన్న తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## దగ్గు సిరప్ తో చిన్నారుల మృతి..
## ఇతర దేశాలకు ఎగుమతిపై ఆరా తీసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

ఢిల్లీ, అక్టోబర్ 08 (భారత శక్తి) : దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో దాదాపు 20 మంది చిన్నారులు మృతి చెందడం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసిన కోల్డ్‌రిఫ్ దగ్గుమందు ఈ చిన్నారుల మరణాలకు కారణమైంది. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) స్పందించింది. ఈ సిరప్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని భారత్ నుంచి వివరాలు కోరింది. ఈ మేరకు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గు మందును ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అడిగిందని, సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అని అంశంపై అంచనా వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్‌ను కోరిందని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో మరణాల సంఖ్య పెరుగుతోంది. మృతుల సంఖ్య ఈరోజు 20కి చేరింది. ఒక్క చింద్వాడలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయారని మధ్యప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి రాజేంద్ర శుక్లా వెల్లడించారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ ఈ మందును తయారు చేసిందని, కంపెనీలో తనిఖీలు చేయగా సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలిందని అధికారులు తెలిపారు. ఇది అత్యంత విషపూరితమైన రసాయనమని పేర్కొన్నారు. కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ సిరప్‌పై తెలంగాణతో సహా పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

## ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు...
## రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



Susumu Kitagawa
Kyoto University
Japan

Richard Robson
University of Melbourne
Australia

Omar M. Yaghi
University of California, Berkel
USA

నోయిడా, అక్టోబర్ 08 (భారత శక్తి) : ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. 'మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (MOFs)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివృద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన MOFలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా MOFలు రూపుదిద్దుకున్నాయి. "మెటల్ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకోవడానికి ఇవి ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.

# భారత రాజకీయ చరిత్రలో ఒక అసాధారణ నాయకుడు

- మూడు సార్లు భారత ప్రధానిగా తిరుగులేని నరేంద్ర మోడీ
- గ్రామీణ నేపథ్యం నుంచి దేశ ప్రధానిగా అత్యుత్తమ ప్రయాణం
- ప్రపంచదేశ చిత్రపటంలో భారత జండాను ఎగురవేసిన నాయకుడు
- కృషి, పట్టుదల, ప్రజాభిమానం ఆయనకే సొంతం
- ప్రత్యర్థులకు జవాబు దొరకని ప్రశ్నగా మిగిలిన మేధావి
- భారతీయ జనతా పార్టీకి శ్వాసగా, సమాజసేవ కాంక్షగా ఆయన జీవితం
- ఆయన బాల్యం నుంచి ఇప్పటివరకూ తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించిన వ్యక్తిత్వం
- మోడీ అనే రెండక్షరాలు సంచలనాలకు మారుపేరుగా నిలిపిన దురంధరుడు
- భారతదేశం గురించి ఎవరైనా ఆలోచించాలంటే ముందు గుర్తుకువచ్చేది మోడీ
- పాతికేళ్ల తన పాలనా ప్రస్థానంలో ఎక్కడ చూసినా విజయాల పరంపరే
- నరేంద్ర మోడీ విజయవంతమైన పాలనను అభినందిస్తూ "ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ" అందిస్తున్న ప్రత్యేక కథనం





(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, అక్టోబర్ 08 (భారత శక్తి) :** భారత రాజకీయ చరిత్రలో నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ పేరు ఒక మైలురాయిగా నిలిచిపోయింది. గ్రామీణ నేపథ్యం నుంచి దేశ అత్యున్నత పదవికి చేరిన ఆయన జీవితం కేవలం రాజకీయ ప్రయాణమే కాకుండా, కృషి, పట్టుదల, ప్రజాభిమానాల సంకేతంగా నిలిచింది.

*** బాల్యం నుండి రాజకీయ రంగప్రవేశం వరకు ఒక్కసారి చూస్తే :**

నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17, 1950 నాడు గుజరాత్‌లోని వద్నగర్‌లో ఓ సాధారణ కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే మోదీకి దేశ సేవపై ఆసక్తి ఉండేది.. ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్ర స్వయంసేవక్ సంఘ్) లో సేవా కార్యక్రమాలతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. అటు పిమ్మట బీజేపీలో చురుకైన నాయకుడిగా ఎదిగి, 1990లలో పార్టీకి కీలక వ్యూహకర్తగా గుర్తింపు పొందారు.

*** 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా :**

2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా నియమితులై, 13 ఏళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారు. ఆయన హయాంలో పరిశ్రమలు, మౌలిక వసతులు, విద్యుత్ రంగాలలో సంస్కరణలతో "గుజరాత్ మోడల్" ను సృష్టించారు. ఈ విజయాలు ఆయనకు జాతీయ స్థాయిలో ప్రజాదరణ తీసుకువచ్చాయి.

*** ప్రధానిగా మూడు విజయవంతమైన పదవీకాలాలు :**

2014లో మొదటి సారి ప్రధానమంత్రిగా పదవీ స్వీకారం చేశారు.. బీజేపీ చరిత్రలో తొలిసారి పూర్తి మెజారిటీతో 282 సీట్లు సాధించింది.

ఇక మోదీ నాయకత్వంలో దేశం "సభ్కా సాథ్, సభ్కా వికాస్" నినాదంతో అభివృద్ధి దిశగా పయనించింది.

**ఆయన చేపట్టిన ముఖ్య సంస్కరణలు :**

జనధన్ ఖాతా యోజన.. స్వచ్ఛ భారత్ మిషన్.. మేక్ ఇన్ ఇండియా.. డిజిటల్ ఇండియా.. 2016 లో నోట్ల రద్దు.. 2019లో రెండోసారి ఘన విజయం.. ఈ క్రమంలో ప్రజాభిమానం మరింత పెరిగి, బీజేపీ 303 సీట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వచ్చింది.

*** మోదీ నాయకత్వంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు :**

ఆర్టికల్ 370 రద్దు.. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదా రద్దు.. పౌరసత్వ సవరణ చట్టం.. అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి న్యాయపరమైన మార్గం.. ఆరోగ్య రంగంలో "ఆయుష్మాన్ భారత్".. ఇక 2024లో మూడోసారి ప్రధానిగా చారిత్రక ఘనత సాధించారు.. 2024లో మోదీ మళ్లీ ప్రజా తీర్పుతో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. మూడోసారి ప్రధానిగా అవతరించడం ద్వారా, జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఇది అరుదైన ఘనతగా నిలిచింది..

*** ఇక ప్రస్తుతానికి వస్తే :**

"వికసిత్ భారత్ 2047" లక్ష్యం.. 'ఆత్మనిర్భర్ భారత్' తో స్వయం సమృద్ధి ఆర్థిక విధానం.. సాంకేతిక, రక్షణ, అంతరిక్ష రంగాల్లో గ్లోబల్ నాయకత్వం సాధించడం..

*** ప్రజాదరణ వెనుక ఉన్న బలమైన కారణాలు :**

చక్కటి ప్రసంగ నైపుణ్యం, సామాన్య ప్రజలతో నేరుగా సంభాషణ.. బలమైన నిర్ణయాలు, జాతీయతా భావనపై దృష్టి.. అభివృద్ధి కేంద్రిత విధానాలు.. ప్రపంచ వేదికలపై భారత ప్రతిష్టను పెంపొందించడం..



*** చివరగా చెప్పుకుంటే :**

చాయ్ అమ్మే బాలుడి నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఎదిగిన నరేంద్ర మోదీ కథ ప్రజాస్వామ్య శక్తికి ప్రతీక. మూడుసార్లు ప్రధానిగా ప్రజలు ఆయనపై ఉంచిన నమ్మకం, భారతదేశాన్ని గ్లోబల్ శక్తిగా తీర్చిదిద్దే ప్రయత్నానికి మద్దతుగా నిలిచింది. "మోదీ యుగం" అని పిలవబడే ఈ దశలో భారతదేశం సాంకేతిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది.

ఇది కేవలం కలలు కంటే సాధ్యం కాదు.. ఆ కలలను సాకారం చేసుకునే దిశగా మోడీ సాగించిన కఠినతరమైన ప్రయాణమే నిదర్శనం.. ఏది ఏమైనా భారతదేశ రాజకీయ ప్రస్థానంలో



నరేంద్ర మోడీది ఒక సువర్ణాధ్యాయం అని చెప్పవచ్చు.. రాజకీయాల్లో అసంతృప్తి, విపక్షాల విమర్శలు.. కొన్ని ఓటమిలు.. అనేవి సర్వసాధారణం.. కానీ అత్యధిక నిష్పత్తిలో.. విజయాలను చేజిక్కున్న విభిన్న, విప్లవాత్మక, విశిష్ట గుణగణాలు కల్గిన రాజకీయ నాయకుడిగా, విజయవంతమైన దేశాధినేతగా నరేంద్రమోడీకి హృదయపూర్వక అభినందనలు..

# ఉమ్మడి జిల్లాలో బలమైన నాయకుడు దామన్న

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 08 (భారత శక్తి) :** రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ పేరు తెలియని వారు ఉండరు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి రాజకీయ నాయకుడికి ఈ పేరు సుపరిచితం చిరపరిచితం.ఆయన మీసాలు ఉన్న ఫోటో చూస్తే చాలు, పేరు ఉండాల్సిన పనిలేదు.ముఖంలో చిరునవ్వు మీసంలో రోషం పౌరుషం సింహం లాంటి మాటల గాండ్రింపు చివరి వరకు ఉమ్మడి జిల్లాలో ఆయన చరిష్మా తగ్గలేదని చెప్పడంలో ఏమాత్రం సందేహించాల్సిన పనిలేదు. ఇటీవల ఆయన మృతి చెందిన వార్త విని ఆయన గురించి అభిమానులు సోషల్ మీడియాలో తెలిపిన నివాళులు,నేరుగా ఆయన అంతిమయాత్రలో,అంతిమ వీడ్కోలు కార్యక్రమాలలో, పాల్గొన్న అశేష అభిమాన జనం,పార్టీ నాయకులు,పార్టీలకు అతీతంగా వచ్చిన రాజకీయ పెద్దలు,కార్యకర్తలు, అభిమానులు,చూసుకుంటే పుడితే ఇలాంటి పుట్టుక పుట్టాలి అని ఎవరికైనా అనిపించక తప్పదు. రాజకీయం ఎందరో చేస్తారు కానీ కొందరే ప్రజల మనసులను గెలుచుకుంటారు. దామోదర్ రెడ్డి ఈ వరుసలో ఉన్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య,నందమూరి తారక రామారావు,వైయస్ రాజశేఖర్ రెడ్డి, లాంటి నాయకుల వరుసలో దామోదర్ రెడ్డి పేరు నిలిచిపోతుంది.రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో రామ్ రెడ్డి దామోదర్ రెడ్డిగా ప్రజలకు పరిచయమైనప్పటికీ ఆయన అనతి కాలములోనే తుంగతుర్తి,సూర్యాపేట నియోజకవర్గ ప్రజల కార్యకర్తల అభిమానుల అభిమానాన్ని సంపాదించుకుని దామన్నగా పేరు పొందారు.ఆ తర్వాత ఆయన వ్యక్తిత్వం ముక్కుసూటితనం కార్యకర్తలకు అండగా ఉండే విధానం చూసి పార్టీ అభిమానులు కార్యకర్తలు ఆయనకు "టైగర్" అనే బిరుదును అంకితం చేశారు. టైగర్ అంటే అడవుల్లో ఉండాలి అని అందరూ అంటారు.కానీ టైగర్ మనిషి రూపంలో వస్తే ఇలాగే ఉంటాడు అని అనిపించేలా దామన్న తన జీవితాన్ని ప్రజలకు కనపరిచారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా దామన్న మనుషులంగా ఉంటే చాలు అని కార్యకర్తలు అభిమానులు అనిపించుకునే విధంగా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించారు. ఆయన తరువాత ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ముందుకు నడుస్తున్నారు. ఈ సమయంలో దామోదర్ రెడ్డి పుట్టుక రాజకీయ ప్రజలతో ఆయన గడిపిన జీవిత విశేషాలు కొన్ని తెలుసుకుందాం.ఉమ్మడి ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాత లింగాల గ్రామానికి చెందిన రాంరెడ్డి నారాయణరెడ్డికమలమ్మ దంపతులకు 1952 సెప్టెంబరు 14న దామోదర్‌రెడ్డి జన్మించాడు. వీరిది భూస్వామ్య వ్యవసాయ కుటుంబం.

*** ఎనిమిది మంది తోబుట్టువులు.వీరిలో నలుగురు అన్నదమ్ముళ్లు. నలుగురు అక్కాచెల్లెళ్ళు.**

మొదటి నుండి కూడా వీరి కుటుంబానికి రాజకీయ చరిత్ర ఉన్నది.దామోదర్ రెడ్డి ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనే కొనసాగించాడు.హైస్కూల్ విద్యను హైదరాబాద్ వివేకవర్ధని పాఠశాలలో పూర్తి చేశాడు. తర్వాత వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుండి 1973 లో బిఎస్సి డిగ్రీ పొందాడు.కళాశాల రోజుల నుండి నాయకత్వ లక్షణాలతో చలామణి అయ్యాడు. క్రీడల్లోనూ రాణించేవాడు.*తెలంగాణ నినాదంతో* విద్యార్థిగా 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన చరిత్ర దామన్నకు ఉన్నది.1971లో జై ఆంధ్ర ఉద్యమానికి వ్యతిరేకంగా జై తెలంగాణ అంటూ మరోసారి జైలుకు వెళ్లాడు.

*** రాజకీయ ప్రస్థానం**

వివాహం తరువాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రస్తుత



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో స్థిరపడి, అక్కడి నుండే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించాడు.యువజన నాయకుడుగా కాంగ్రెస్ పార్టీలో చేరి, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు వి.హనుమంతరావు నాయకత్వంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు చేపట్టి అందరి మన్ననలు పొంది ఆకర్షితులయ్యారు. అప్పట్లో చంద్రబాబునాయుడు, కెసిఆర్ లాంటి వారితో దామోదర్ రెడ్డి యువజన కాంగ్రెస్ లో కలిసి పనిచేశారు. చిన్న స్థాయి కార్యకర్త నుండి క్యాబినెట్ మంత్రి వరకు ఎదిగిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి తుంగతుర్తి లో నాలుగు సార్లు సూర్యాపేటలో ఒకసారి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాడు.యువజన సంఘం నాయకుడు నుండి తుది శ్వాస వరకు 73 సంవత్సరాల వయసు వచ్చేవరకు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేసి గట్టి నాయకుడు అనిపించుకున్నాడు.

*** మల్లు స్వరాజ్యం పైన గెలుపొందిన ఘనుడు**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు గరుడుగట్టిన కమ్యూనిస్టు నాయకులు భీమిరెడ్డి నరసింహారెడ్డి,మల్లు స్వరాజ్యం లాంటి కమ్యూనిస్టుల కంచుకోట తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం దామోదర్ రెడ్డి కి మాత్రమే సాధ్యమైంది.1985 జరిగిన శాసనసభ ఎన్నికల్లో సాయుధ పోరాట యోధురాలు సీపీఎం నాయకురాలు మల్లుస్వరాజ్యం పైన గెలుపు బావుట ఎగురవేసి కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నాయకుడిగా రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

*** రెండుసార్లు మంత్రిగా**

ఉమ్మడి రాష్ట్రంలో 1991- 1992 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్. జనార్ధన్ రెడ్డి మంత్రివర్గంలో భూగర్భజలవనరుల శాఖ మంత్రిగా అదేవిధంగా 2008 2009 మధ్యకాలంలో దివంగత నేత వైయస్.రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

*** వైయస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత ప్రీతిపాత్రుడు**

మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దామోదర్ రెడ్డి అత్యంత ప్రీతి పాత్రుడుగా ఉండేవారని రాజకీయ విశ్లేషకులు పార్టీ నాయకులు అభిమానులు తెలియజేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గానీ అంతకుముందు అయినా పార్టీ నిర్ణయాలు ప్రభుత్వ పాలక నిర్ణయాలు తీసుకోవడంలో రాజశేఖర్ రెడ్డి కచ్చితంగా తన ఉద్దేశాలను దామోదర్ రెడ్డి తో పంచుకునే వారిని అన్నదమ్ముల వలె కలిసి ఉండేవారని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.

*** మాట తప్పని మడమతిప్పని నాయకుడు**

దామోదర్ రెడ్డి ఎవరికి మాట ఇచ్చినా ఆ మాట మీద ఖచ్చితంగా నిలబడే వారిని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారు. మాట ఇచ్చేముందు బాగా ఆలోచించేవారని ఇచ్చిన తర్వాత వెనకడుగు వేసే వారు కాదని స్పష్టంగా తెలుస్తుంది. ఆయనకు అత్యధికంగా అభిమానులు పెరగడానికి ఇదొక ముఖ్య కారణం అని చెప్పొచ్చు.

*** పార్టీ మారలేదు**

మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర రావులు తమ పార్టీలో లోకి ఆహ్వానించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీకి కట్టుబడి ఉంటానని తనకు పదవులు అవసరం లేదని పార్టీ ముఖ్యం పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు ముఖ్యం అని తేల్చి చెప్పిన నాయకుడిగా దామోదర్ రెడ్డి పేరు సంపాదించుకున్నారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నా లేకపోయినా పార్టీ సిద్ధాంతమే ముఖ్యంగా కొనసాగారు.తన రాజకీయ జీవితంలో అనేక ఆటుపోట్లు వచ్చినప్పటికీ అదరక బెదరక భయపడక ముందుకు కొనసాగారు. గోదావరి జలాలను శ్రీరాంసాగర్ నీటిని తుంగతుర్తి,సూర్యాపేట నియోజకవర్గాలకు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు.

*** తుది అంకం**

రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి జిల్లాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దామోదర్ రెడ్డి కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ 73 ఏళ్ల వయసులో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఏఐజి ఆసుపత్రిలో అక్టోబర్ 1 వ తేదీ, 2025న తుది శ్వాస విడిచారు.ఆయన అంత్యక్రియలు తనకు ఎంతో ఇష్టమైన తుంగతుర్తిలోని వ్యవసాయక్షేత్రంలో నిర్వహించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.